ప్రజాశక్తి
తూర్పుగోదావరి
సోమవారం
జనవరి - 1
2018
పేజీలు 12




కడియం నర్సరీల్లో పూలతో ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ శుభాకాంక్షలు

మూడో విడతలోనూ నిరాశే...

మాఫీ చేయాల్సింది రూ.175.93 కోట్లు
మాఫీ చేసింది రూ.53.06 కోట్లు
1,85,987 మందికి మాఫీ కోసం నిరీక్షణ

తాను అధికారంలోకొస్తే రైతుల వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తానని సిఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రకటించారు. అధికారంలోకొచ్చాక స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అన్నారు. రుణం ఎంత తీసుకున్నప్పటికీ రూ.1.50 లక్షల వరకు మాత్రమే మాఫీ చేస్తామన్నారు. మూడు విడతల్లోనూ చెప్పింది కూడా చేయలేదు.



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు 6.50 లక్షల మంది రైతులు రూ.13,009 కోట్ల వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అని చెప్పి రూ.1.50 లక్షలే మాఫీ చేస్తానని చెప్పింది. దీంతో జిల్లాలో రూ.1.50 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులు రూ.4.62 లక్షలుగా ప్రభుత్వం నిర్ధారించింది. తొలి విడతలో రూ.611 కోట్లు మాఫీ చేస్తానని ప్రకటించి జిల్లాకు రూ.345 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంలో లక్షా 28వేల 886 మంది రైతులకు రూ.142 కోట్లు మాత్రమే మాఫీ చేసింది. రెండో విడతలో రూ.175 కోట్లు

వార్త 4లో

న్యూ జోష్

వెళ్లొస్తా.. అంటూ 2017 వీడ్కోలు పలికింది
నేనొస్తున్నా.. అంటూ 2018 అడుగుపెట్టింది
కొత్త ఆశలు.. ఆకాంక్షలను మోసుకొచ్చింది
365 రోజులపాటు తోడుంటానని మాటిస్తూ
నవ వసంతం అందరి జీవితాల్లో ప్రవేశించింది.

గతేడాది ఎన్ని ఎత్తుపల్లాలు ఎదుర్కొన్నా.. కాలానికే వదిలేద్దాం. కొత్తసంవత్సరంలో కొత్త జీవితాలను ప్రారంభిద్దాం. చెదిరిన స్వప్నాన్ని ఈసారి సాకారం చేసుకుందాం. కొత్త ఆశయాలు.. కొత్త లక్ష్యంతో ముందుకు సాగుదాం. చల్లటి గోదారి తీరంలో ఈ ఏడాది కొత్త ఉషస్సులు వెదజల్లాలని ఆశిద్దాం. ఉపాధి లేక, ఆక్వాచెరువుల విస్తరణతో వలసబాట పట్టిన అన్నదాత సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిద్దాం. విద్య, ఉపాధి అవకాశాలు మెరుగై యువతకు బంగారు భవిత దక్కాలని కోరుకుందాం.

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. వాడవాడలా చిన్నా, పెద్దా సంబరాల్లో మునిగితేలారు. యువత కేరింతలు, ఆటపాటలతో సందడి చేసింది. పాత సంవత్సరానికి ఘనమైన వీడ్కోలు చెబుతూనే కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం పలికారు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు కాగానే ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కేక్‌లు కట్‌చేసి కొత్త సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు.

నేతలు.. ఆశల ఊసులు..


శాంతిభద్రతల పరిరక్షణ



ఉపముఖ్యమంత్రి, హోంశాఖమంత్రి నిమ్మకాయల చినరాజప్ప

రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులు, సౌభాగ్యాలతో వర్ధిల్లాలి. కొత్త ఏడాదిలో విజయాలు సిద్ధించి అందరికీ మంచి జరగాలి. నేర రహిత రాష్ట్రంగా ఎపిని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోంది. సిఎం చంద్రబాబు చేపడుతున్న సంస్కరణలతో నవ్యాంధ్ర ప్రదేశ్ 2018లో కూడా అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంటుంది. ప్రజలందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు.

కొత్త ఆశలతో ముందుకు సాగాలి



యనమల రామకృష్ణుడు, ఆర్థికశాఖ మంత్రి

రాష్ట్ర ప్రజలంతా కొత్త ఆశలతో ముందుకు సాగాలి. కొత్త ఏడాదిలో ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలి. ప్రజలకు నూతన వెలుగులు నిలవాలి. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలి. రాష్ట్రాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి సాధించాలి.

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి



కార్తికేయ మిశ్రా, కలెక్టర్

జిల్లా అభివృద్ధికి యంత్రాంగం సమిష్టి బాధ్యతగా స్వీకరించి కృషి చేస్తోంది. నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధి సాధించనుంది. జిల్లా పారిశ్రామికంగా, పర్యాటకంగా జిల్లా అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో అందరికీ ఉపాధి అవకాశాలు రానున్నాయి. ముఖ్యంగా కాకినాడ పర్యాటంకగా అభివృద్ధి చెందుతుంది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు బీచ్‌లో జరుగుతున్నాయి. వ్యవసాయకంగా జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుంది. రైతులు అధికారులకు సహకరిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

కొత్త ఏడాది మంచి జరగాలి



విశాల్ గున్నీ, జిల్లా ఎస్‌పి

కొత్త ఏడాదిలో ప్రజలకు మంచి జరగాలి. ఎటువంటి నేరపూరిత చర్యల జోలికి వెళ్లకుండా అంతా జాగ్రత్త వహించాలి. ప్రజలు పోలీసులకు సహకరించి స్నేహపూర్వకంగా మెలగాలి. జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉండేందుకు అన్ని వర్గాలు సహకరించాలి. పోలీసులు కూడా సమన్వయంతో వ్యవహరించి ప్రజామన్ననలు పొందాలి. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలి. ప్రజలకు కొత్త ఏడాదిలో మరింత మంచి జరగాలని కోరుకుంటున్నాను.

పథకాల అమల్లో పక్షపాతం

12లో

విఆర్‌లోకి ఈస్ట్ జోన్ డిఎస్‌పి

12లో

సమకాలీన పరిస్థితులపై అధ్యయనం అవసరం : యుటిఎఫ్

10న సిఎం పర్యటన

12లో

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు మావోయిస్టులు మృతి

వార్త మెయిన్‌లో...

కార్టూ'నిజం'



వైజ్ఞానిక విద్యలో జొన్నాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

కాకినాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో డిజిటల్ టెక్నాలజీ సొల్యూషన్స్ విభాగాలకు పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సెల్‌ఫోన్ మైక్రోస్కోప్‌కు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, స్లైడ్ ప్రొజెక్టర్‌కు తృతీయ బహుమతి అందాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైఆర్‌కె.శాస్త్రి తెలిపారు. దీంతో వారికి జనవరి 2,3,4 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా స్థాయిలో ప్రథమ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులు కొప్పిశెట్టి సురేంద్రను, రొక్కల వేణును, గైడ్ టీచర్స్ చింతా శ్రీనివాసరెడ్డిని, జెవి.ధర్మరాజును, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారా యణరెడ్డి, మాజీ ఎంపిపి ఉపాధ్యక్షుడు గొడవర్తి బాబి అభినందించారు.


అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

కమ్యూనిటీ హాలును ప్రారంభించిన ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని అర్తమూరు గ్రామంలో ఎస్‌సి కాలనీలో రూ.15లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలకనుగుణంగా సదుపాయాలు కల్పించడంతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, సొసైటీ అధ్యక్షులు పడాల రామకృష్ణారెడ్డి, ఆత్మ కమిటీ జిల్లా సభ్యులు తాపీలు, కర్రి సత్యనారాయణరెడ్డి, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - మండపేట

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 26,27 వార్డుల్లో ఆయన పర్యటించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై గృహిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, తడిచెత్త, పొడిచెత్త విభజించి డబుల్ డస్ట్‌బిన్‌లో వేసి పారిశుద్య కార్మికులు వచ్చినప్పుడు వారికి అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లంకలపల్లి రాంబాబు, బండి గోవిందు, పారిశుద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాగేంద్రకు సత్కారం

ప్రజాశక్తి - మామిడికుదురు

మానేపల్లి శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న జి.నాగేంద్ర కుమార్‌కు రాష్ట్ర ఉత్తమ గ్రంథపాలకుని అవార్డు వచ్చిన సందర్భంగా రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అమరావతి(గుంటూరు) ఎపిఎన్‌జిఒ హోమ్‌లో రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొన దేవరాజు, పౌర గ్రంథాలయ శాఖ డైరక్టర్ పి.పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, జివిఆర్ఎస్ హెచ్ కె.వర్మ, అసోసియేషన్ అధ్యక్షులు దర్శిముల పాక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ ఎటిగట్టు వద్ద సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు, దుకాణం కోల్పోయిన భాధితులకు ఎంఎల్ఎ చీర్ల జగ్గిరెడ్డి రూ.5000 నగదును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకు పాక, కిరాణా దుకాణం పూర్తిగా దగ్ధమవ్వడంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస, నాయకులు కర్రినాగిరెడ్డి, ఎన్.నాగమోహన్‌రెడ్డి, చేమూడులంక సర్పంచ్ బి.వీరవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగరలో కొలువై ఉన్న శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఓ దాత రూ.లక్ష విరాళం అందించారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన దాత పెంటపాటి వెంకట్రాజు దంపతులు ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ విరాళం అందించిన దాతను కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు దాసరి లక్ష్మణమూర్తి, పెద్దింశెట్టి రామస్వామి, వాసా కోటేశ్వర రావు, బసవ శంకరం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు స్టాలిన్‌బాబు పరామర్శ

ప్రజాశక్తి - పి.గన్నవరం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అడ్డగళ్ళ అచ్యుత సుభాష్‌చంద్రబోస్ కుటుంబాన్ని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి, సబ్‌ప్లాన్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నేలపూడి స్టాలిన్‌బాబు ఆదివారం పరామర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు అచ్యుతరామయ్య కుటుంబానికి చెందిన బోస్ మృతికి సంతాపం తెలిపారు. పితృవియోగంతో బాధపడుతున్న యర్రంశెట్టి రాజాబాబు కుటుంబాన్ని కూడా పరామర్శించారు. రాజాబాబు తండ్రి సూర్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు. ఆయనతో మాజీ ఎఫ్‌సిఐ సభ్యులు ఇందుకూరి నరసింహరాజు, చింతా రతన్‌రాజు ఉన్నారు.

2 నుంచి లేపాక్షి ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.శ్రీనివాసరేష్ ఆదేశాల మేరకు నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల సందర్భంగా లేపాక్షి ఎగ్జిబిషన్‌ను రాజమహేంద్రవరంలో జనవరి 2 నుంచి నిర్వహిస్తున్నట్లు లేపాక్షి రాజమహేంద్రవరం బ్రాంచి మేనేజర్ షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. స్థానిక తిరుమలతిరుపతి దేవస్థానం కళ్యాణమండపంలో జనవరి 2వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పాలి ప్రసాద్ ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. హస్త కళా వస్తువులు, చేనేత వస్త్రాలు ప్రదర్శన, అమ్మకం జరుగుతాయని తెలిపారు.


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఘనంగా 'విశ్వసాయి' తృతీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బొబ్బిల్లంకలో విశ్వసాయి విద్యానికేతన్ గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ విద్యను అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని రమా నర్సింగ్ హోం డాక్టర్ శశికళ అన్నారు. బొబ్బిల్లంకలోని పాఠశాలలో విశ్వసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ తృతీయ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శశికళ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కరస్పాండెంట్ కంటిపూడి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రిన్సిపల్ దేవి సత్యవేణి అందించారు. పాఠశాల డైరెక్టర్ మోహన శ్రీహరి, ఎంపిటిసి సభ్యులు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

జన్మభూమి గ్రామసభల్లో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందేలా కృషి చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు విత్తనాల మాణిక్యాలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జన్మభూమి గ్రామసభలపై సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. జన్మభూమి గ్రామసభల్లో ప్రజలు సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జన్మభూమి గ్రామసభల షెడ్యూల్ ప్రకటించారు. 2న పాశర్లపూడిలంక, టేకుర్రు, మాకనపాలెం, ఆదుర్రు, 3న కొమరాడ, మామిడికుదురు, ఈదరాడ, పెదపట్నం, 5న అప్పనలంక, 6న గెద్దాడ, మొగలికుదురు, 8న కరవాక, గోగన్నమఠం, మగటపల్లి, నగరం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుబ్బల వెంకటసత్యనారాయణ, మద్దాల పెద్దకాపు, ఈల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకు వద్ద వీధి కుళాయి

గౌరి కోనేరులో తాగునీరు బంద్..

ప్రజాశకి-పెద్దాపురం

పెద్దాపురం గౌరి కోనేరు కాలనీలోని మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన మంచినీటి కుళాయి ద్వారా నీటి సరఫరా ఆగిపోయి మూడు నెలలు గడిచినా ఈ నాటికీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ఇంటికుళాయిలు లేనివారికి ఈ కుళాయి నీరే పెద్ద దిక్కుగా ఉందన్నారు. కుళాయి గొట్టంలో అవాంతరం ఏర్పడి నీటిసరఫరా ఆగిపోయిందన్నారు. మంచినీటి సరఫరా సిబ్బంది తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. కుళాయి ఆగిపోవడం వల్ల తాము మంచినీటికు ఎన్నో అవస్థలు పడుతున్నామని కాకినాడ పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఎవరి ఇంటికి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుంటామని ఆమె వాపోయారు. ఇంటి కుళాయిలు లేనివారికి ఈ వీధి కుళాయి పెద్దదిక్కుగా ఉందని వెంటనే దీన్ని రిపేరు చేయించాలని విజ్ఞప్తి చేశార.

కుళాయి నీరు రాక అవస్థలు పడుతున్నాం
చెయ్యేటి పాపాయమ్మ



కుళాయి నుంచి నీటి సరఫరా ఆగిపోవడంతో మంచినీటికి అవస్థలు పడుతున్నాము. మూడు నెలలుగా మేము అవస్థలు పడుతున్నా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. కుళాయి గొట్టాన్ని రిపేరు చేయించడం పెద్ద పని కాదు. దీనికి వ్యయం కూడా ఎంతో అవదు. అయినా సరే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే ఈ కుళాయి రిపేరు చేయించి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలి.

తాళ్లరేవులో బిసి హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి- తాళ్లరేవు



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ సుబ్బరాజు

తాళ్లరేవులో రూ.58.15 లక్షలతో బిసి వెల్ఫేర్ నిధులతో నిర్మించిన జ్యోతిరావు పూలే బిసి హాస్టల్‌ను ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి టేకుమూడి అనంతలక్ష్మి లక్షణరావు, స్థానిక సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, కట్టా త్రిమూర్తులు, వైస్ ఎంపిపి కె.సిద్ధి శేషారావు, కోరంగి సర్పంచ్ దడాల రాణి, దంగేటి శ్రీనివాసరావు, పి.లక్ష్మీనారాయణరాజు, బర్రే లక్ష్మీనరసింహరాజు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వల్లు రాజుబాబు, సంగాని దాసు, అత్తిలి బాబూరావు, సుందరిపల్లి గోపాలకృష్ణ, చీకట్ల రామచంద్రన్న, కాదా వెంకటరమణ, యల్లమిల్లి రాంబాబు, వైసిపి మండల కన్వీనర్ మల్లాడి భైరవ మూర్తి, కముజు ఉమా మహేశ్వరరావు, సింగవరపు శ్రీనివాస రణధీప్‌కుమార్, అత్తిలి బాబూరావు, చిట్టూరి చలపతి, పోలినాటి భైరవ మూర్తి, సాధనాల వెంకట్రావు, బోలా విజయ్‌కుమార్, తాళ్ళరేవు వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దుప్పి అదృష్టదీపుడు, ఎం.తణుకురాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావు



చెక్కును అందజేస్తున్న వరుపుల

పేదలను ఆదుకో వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావు అన్నారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కొండె లక్ష్మణరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధుల నుంచి మంజూరైన రూ.లక్షా 50 వేల చెక్కును ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావు, డిసిసిబి చైర్మన్ వరుపుల రాజా అందజేశారు. డిసిసిబి చైర్మన్ వరుపుల రాజా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంతిన సురేష్, యాళ్ల విశ్వేశ్వరావు, బత్తుల నాగార్జున, అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గోకవరం- రంపయర్రంపాలెం రోడ్డులో బురదకాలువ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో రంపయర్రంపాలేనికి చెందిన కాళ్ల నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు పక్కనే గాయపడి ఉన్న అతన్ని అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వైద్యులు అతనికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి రిఫర్‌చేశారు. ఆయన పరిస్థితి విషమించడంతో అతడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం క్రైం

నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం అర్బన్ పోలీసులు నగరంలోని పలు కూడళ్లల్లో భారీ బందోబస్తు మధ్య ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ముందస్తుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్య కూడళ్లల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ తనిఖీలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి.

ఇంటింటికీ టిడిపిలో మంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి-పెద్దాపురం



ఇంటింటికీ టిడిపిలో మంత్రి చినరాజప్ప

పట్టణ పరిధిలోని 11, 12, 23, 24, 4, 28 వార్డుల్లో ఆదివారం నిర్వహించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో మంత్రి చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆయన ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నందున వీటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఏమైనా సమస్యలున్నా వెంటనే ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. జన్మభూమి గ్రామ సభల్లో సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వారందరికీ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక 12వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించిన మున్సిపల్ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి, పలు సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొరిపూరి రాజు, టిడిపి అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు బంగారుబాబు, ఆత్మ చైర్మన్ కలకపల్లి రాంబాబు, ఆయా వార్డుల కౌన్సిలర్లు కొయ్యాన రాజు, వేదంపూడి సత్తిబాబు, ఉల్లి మంగ, జయరావు, ఓడిబాని దుర్గాభవానీ, టిడిపి నాయకులు అన్నాబత్తుల అంజిబాబు, సానారి తాతరావు, పప్పల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యానికేతన్‌లో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదర్శ విద్యానికేతన్‌లో నూతన సంవత్సరం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఆదర్శ కళాశాల కరస్పాండెంట్ దాడి చిన్నారావు, సర్పంచ్ నాగలక్ష్మి అందజేశారు. విద్యార్థులు అలంకరించిన రంగురంగుల ముగ్గులను ప్రజలను ఆకర్షించాయి. ఈ ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలకు ఉత్సాహన్ని కలిగించే విధంగా ఉన్నాయని సర్పంచ్ నాగలక్ష్మి అన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా దొడ్డిపట్ల సోమన్నదొర, ఉపాధ్యాయురాలు సంధ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దాడి వెంకటరమణ, సీతారామరాజు, విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సర్పంచ్





ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



వీరబాబు మృతదేహం

కొట్లాటలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కొండెవరంలో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... కొండెవరం గ్రామానికి చెందిన రమేష్ లారీపై అదే గ్రామానికి చెందిన వీరబాబు క్లీనర్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం వీరిద్దరూ గ్రామంలోని వైన్‌షాప్‌లో మద్యం తాగారు. ఆ తరువాత వీరి మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా గాయపడిన వీరబాబు ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.సత్యనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి-కరప

గొర్రిపూడి గ్రామానికి చెందిన మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. దార దుర్గ (23) భర్తకు దూరంగా తండ్రి వద్దే ఉంటోంది. మోటర్ పైపుతో భవనం గోడలు తుడుపు తుండగా నీరు రావడం లేదని మోటార్ విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి లోనయ్యింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం క్రైం

మోరంపూడి వద్ద శనివారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నామవరం డి బ్లాక్‌కు చెందిన దొమ్మేటి జానకిరామ్ శనివారం రాత్రి నామవరం నుంచి మోరంపూడి వస్తున్నాడు. సంపత్‌నగర్‌కు చెందిన ససగదుల స్వామి మోరంపూడి నుంచి ఇంటికి వెళుతుండగా వీరిద్దరి బైకులు మోరంపూడి సెంటర్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ స్థానికులు 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం క్రైం

విఎల్.పురానికి చెందిన కక్కల దుర్గ, భర్త సత్యనారాయణ శనివారం రాత్రి ఇంట్లో ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన సత్యనారాయణ పురుగుల మందు తాగేశాడు. స్థానికుల సహకారంతో దుర్గ ఆటోలో అతడదని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం క్రైం

దివాన్‌చెరువు వద్ద సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని ఆదివారం రాజమహేంద్రవరం వైపు నుంచి రాజానగరం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ వ్యక్తిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని ఏడిద వద్ద సీతానగరం గ్రామంలో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సీతానగరం గ్రామానికి చెందిన ఏడిద నాగేశ్వరరావుకు చెందిన రెండెకరాల గడ్డివామి ఆకతాయిలు పొగ తాగడంతో దగ్ధమయ్యింది. నష్టం విలువ రూ.8 వేలు ఉంటుందని చెప్పారు.

మూడో విడతలోనూ నిరాశే...

(మొదటి పేజీ తరువాయి)

మాఫీ చేస్తానని ప్రకటించి అరకొరగానే మాఫీ చేసింది. మూడో విడతలో జిల్లాలో 2,50,570 మంది రైతులకు రూ.175.93 కోట్లు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు 64,583 మంది రైతులకు చెందిన ఖాతాల్లో రూ.53.06 కోట్లు మాత్రమే జమ చేసింది. ఇంకా 1,85,987 మంది రైతులకు రూ.122.87 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది. అయితే రైతులు కాళ్లరిగేలా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారి రుణాలు మాత్రం మాఫీ కావడంలేదు.రుణ ఉపసమన పత్రాలు పట్టుకుని రైతులు రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ వారి ఖాతాల్లోకి మాఫీ సొమ్ము చేరడంలేదు. మూడో విడతలోనూ రుణాలు మాఫీ కాకపోవడంతో జిల్లాలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీ ప్రారంభం కావడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు, కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు. రుణ ఉపశమన పత్రం, ఆధార్ జిరాక్స్‌లు తీసుకుని బ్యాంకుల వద్దకు వెళ్తుంటే రుణమాఫీ కాలేదని బ్యాంకర్లు చెబుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రుణ ఉపశమనపత్రాలు పట్టుకుని అధికారుల వద్దకు వెళ్తుంటే వారు బ్యాంకర్ల వద్దకు వెళ్లాలని అంటున్నారని, బ్యాంకర్ల వద్దకు వెళ్తుంటే వారు అధికారుల వద్దకు వెళ్లాలని చెబుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మూడేళ్ల క్రితం కరప మండలం వేళంగి ఎస్‌బిఐ బ్రాంచి నుంచి రూ.50 వేలు పంట రుణం తీసుకున్నానని మూడో విడతలో రూ.12,777 మాఫీ కావాల్సి ఉందని ఇంత వరకూ మాఫీ కాలేదని కూరాడకు చెందిన రైతు దూడల వీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశాడు. తాను గతంలో రూ.80 వేల రుణం తీసుకున్నానని కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన జిత్తుక వీరరాఘవులు చెప్పాడు. తనకు రెండు విడతల్లో రూ.60 వేలు రుణమాఫీ జరిగిందని, మూడో విడతలో మిగిలిన సొమ్ము మాఫీ కావాల్సి ఉండగా ఇంతవరకూ మాపీ కాలేదని వాపోయాడు. జిల్లాలో మూడో విడతలో ఇంకా 1,85,987 మంది రైతులకు రూ.122.87 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది. ఇప్పటికైనా తమ రుణాలను మాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉప్పాడకు బస్సు సర్వీసులు నడపరూ...


ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ-కొత్తపల్లికి ఆర్టీసి సేవలు ఈ ఏడాదైనా వచ్చేనా అని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు కాకినాడ-జగన్నాథపురం వంతెన నుంచి కల్పనా థియేటర్ మీదుగా ఉప్పాడ-కొత్తపల్లికి రెండు బీచ్ సర్వీసులు ప్రయాణికులకు సేవలందించేవి. కాకినాడ డిపో నుండి పిఠాపురం మీదుగా ఉప్పాడకు నైట్‌హాల్ట్ బస్‌లు ఉండేవి. రాజమండ్రి, సోమరాయనం పేట, ఏలేశ్వరం, గోకవరం డిపోలకు చెందిన ఆర్టీసి బస్సులు ఉప్పాడకు నడిచేవి. కాకినాడ కల్పనా థియేటర్ నుంచి హార్బర్ మీదుగా ఉప్పాడ-కొత్తపల్లి నడిచే బీచ్‌సర్వీసుల్లో డ్యూటీ చేసేందుకు కండక్టర్, డ్రైవర్లు పోటీ పడేవారు. బీచ్‌రోడ్డులో తిరిగే రెండు సర్వీసులు నిత్యం రద్దీగా నడిచేవి. క్రమేపి ఆటోల రాకతో బీచ్ రోడ్డులో తిరిగే రెండు సర్వీసులోఒక సర్వీసును ఆదాయం లేదని అధికారులే రద్దుచేశారు. రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, తుని, తామరాడ తదితర డిపోల బస్‌లను దశల వారీగా రద్దుచేసుకుంటూ వచ్చారు. ఉప్పాడ-కొత్తపల్లి పరిసరాల ప్రజలు నిత్యం ఉపాధి కోసం కాకినాడ వెళ్లి రావడం, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, పోర్టు, గొడౌన్‌లో పనిచేసే కార్మికులు బస్ సర్వీసులు లేకపోవడంతో నానా అవస్థలుపడుతున్నారు. ప్రయాణీకుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని బీచ్ సర్వీసులు పునరుద్ధరించాలని పిసిసి కార్యదర్శి ఓలేటి రాయభాస్కరరావు, బిజెపి జిలిల్లా కార్యదర్శి రవణం సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులగల రాజు, మేడసాని వరలక్ష్మి నారాయణ, తలారి త్రిమూర్తులు, రావు రంగ నాయకులు, ఆర్టీసి ఉన్నతాధికారులుకు విజ్ఞప్తి చేసారు.

ఉత్తమ కమ్యూనిస్టు కుడుపూడి

నేడు సూర్యనారాయణ వర్ధంతి

కమ్యూనిస్టు విలువలకు, నిజాయితీకి, నిరాడంబరతకు నిలువుటద్దం కుడుపూడి సూర్యనారాయణ. శాఖా కార్యదర్శిగా, కాకినాడ పట్టణ కమిటీ సభ్యుడిగా సేవలందించిన ఆయన ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి కృషి చేశారు. కూడుపూడి పరశురాము, మంగాయమ్మ దంపతుల నాలుగో సంతానంగా 1928లో సూర్యనారాయణ జన్మించారు. ఎస్ఎస్‌యల్‌సి చదివి, ఎపిపిఎస్ పరీక్ష ఉత్తీర్ణత పొంది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం పొందారు. చిన్నతనం నుంచీ భౌతికవాద భావజాలం పునికి పుచ్చుకున్నారు.



హేతువాద దక్పథం, కమ్యూనిస్టు కార్యాచరణతో ఆయన జీవితం గడిచింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక వివాహ వేడుకకు వెళ్లి భర్త చనిపోయిన యువతి సరస్వతిని చూశారు. ఆమె సమాచారం సేకరించి ఇరువురి పెద్దలను ఒప్పించి వితంతు వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. చిన్నమ్మాయి అనురాధకు సిపిఎం పూర్తికాలం కార్యకర్త దువ్వ శేషబాబ్జితో కులాంతర వివాహం చేసి తన ఆస్తిలో సమాన హక్కు రాసి ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఎప్పుడూ లంచం తీసుకోలేదు. అనేక అంశాల్లో ఆదర్శాలు వల్లించడం కాకుండా ఆచరించి చూపిన ఆదర్శజీవి కెఎస్. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు ఎవరు చేరినా, వారితో పరిచయం లేకపోయినా తన దష్టికి వస్తే వారికి అన్ని సదుపాయాలు కల్పించేవారు. పార్టీ పూర్తికాలం కార్యకర్తలయితే తన బిడ్డలుకన్నా ఎక్కువగా ఆదరించేవారు. రూపవాణితో దడాల సుబ్బారావుకి వివాహం కాగానే తన ఇంట్లోనే నివాసం ఏర్పాటు చేశారు. 1946 నుంచి 1952 వరకూ సాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు 18 సంవత్సరాల యువకుడుగా కొరియర్‌గా వ్యవహరించారు. నాడు ఇంద్రపాలెం పార్టీకి బలమైన కేంద్రం కావడంతో అక్కడే ఎక్కువగా నివసించేవారు. తన ఇళ్లు పార్టీ డెన్‌గా ఉండేది. తోరాటి లక్ష్మణమూర్తిని కొంతకాలం తన ఇంట్లో ఉంచుకుని, తర్వాత కొవ్వాడలోని తన మిత్రుడు రావు సత్యనారాయణ (దొరగారు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు) ఇంట్లో ఉంచి అక్కడ నుండి తెలంగాణాకు పంపారు. ప్రాణాలకు తెగించి సాహసోపేత కార్యాలు చేశారు. కెఎస్‌తో ఎవరికైనా పరిచయమైతే వారు కమ్యూనిస్టుగానో, అభిమానిగానో మారిపోతారు. ఆయన ఎక్కడ ఉద్యోగం చేసినా అక్కడ పార్టీ నిర్మాణంలో, క్యాడర్ అభివద్ధిలో కీలక భూమిక పోషించేవారు. పెద్దాపురంలో ఉద్యోగం చేస్తూ సైకిల్ రిపేరు చేసుకునే యాసలపు సూర్యారావుని పరిచయం చేసుకున్నారు. ఆయనతో అభ్యుదయ సాహిత్యం చదివించి నాయకుడుగా, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడుగా అక్కడ పార్టీని అభివ ద్ధి చెందడంలో కెఎస్ కషి ఎనలేనిది. తొలి నాళ్లలో యుటిఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. విశేషం ఏమిటంటే ఈ పార్టీ పనంతా తాను పార్టీ సభ్యుడు కాకుండానే చేశారు. కెఎస్ మహిళా సంఘం నాయకురాలు వాసంశెట్టి మాతాజీకి స్వయంగా మేనమామ కావడంతో, అప్పటికే వాసంశెట్టి సూర్యారావు పార్టీ నాయకుడుగా ఉండటంతో ఇంద్రపాలెం పార్టీ ప్రయోజనాలు నిమిత్తం అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. ఇంద్రపాలెం శాఖలో సిపిఎం సభ్యత్వం పొంది, దీర్ఘకాలం శాఖ కార్యదర్శిగా, కాకినాడ పట్టణ కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

తన స్నేహితులకు ఇళ్ల స్థలాన్ని కొనిపించి, ఇల్లు నిర్మాణం చేసుకోడానికి సలహా, సహకారం అందించేవారు. దీనివల్ల తాను ఆర్థికంగా చాలా నష్టపోయినా ఎక్కడా చెప్పేవారు కాదు. కెఎస్ పెద్దలలో పెద్దరికం, యువకులలో నవ యువకుడు, బాలల్లో పసిబాలుడు, కమ్యూనిస్టులకు ఉత్తేజం, మార్క్సిస్టు సిద్ధాంత వ్యతిరేకులకు బద్ధవిరోధి, అసలు సిసలైన కమ్యూనిస్టు, మహోన్నత మానవతావాది ఇవన్నింటినీ ఒకచోట చేర్చితే కుడుపూడి సూర్యనారాయణ (కెఎస్) కనిపిస్తారు. మానవతావాది కమ్యూనిస్టు కావాలని లేదు గాని ప్రతి కమ్యూనిస్టు విధిగా మానవతావాదిగా ఉంటాడు (ఉండాలి). ఈ విషయం కెఎస్‌కు వందశాతం వర్తిస్తుంది. నిబద్ధత, నిజాయితీ, నిరాడంబరత కెఎస్‌కు ఆభరణాలు.

పార్టీ శ్రేణుల కుటుంబాలతో సన్నిహితంగా ఉంటూ వారి బాగోగులు చూసుకునేవారు. ఆయన సతీమణి సరస్వతి కెఎస్ ఆలోచనలకు ఏరోజూ అడ్డుతగలలేదు. ఆయన సేవానిరతికి, పార్టీ పనులకు ముచ్చట పడేది. నా దేవుడు ఏమంటే నేనూ అదే అనేది. ఆమె దీర్ఘకాలం అనారోగ్యంతో ఉంటే తానే స్వయంగా సపర్యలు చేస్తూ సకాలంలో పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యేవారు. అభ్యుదయ సాహిత్యం సైకిలుపై తిరుగుతూ విక్రయించేవారు. చెకుముకి పత్రిక పిల్లలకు అందించేవారు. ప్రజాశక్తి చందాలు కట్టించడం తన రోజువారీ పనిలో భాగంగా ఉండేది. కొంతకాలం ప్రజాశక్తి సాహిత్యాన్ని తోపుడు బండి అద్దెకు తీసుకుని విక్రయించేవారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదురుగా బడ్డీషాపు నిర్వహించేవారు. ప్రజాశక్తి చదవని రోజు ఆయనను కలవడానికి కార్యకర్తలు భయపడేవారు. ఇంద్రపాలెం హైస్కూల్, వాటర్ ట్యాంక్, జెడ్ బ్రిడ్జి నిర్మాణంలో కెఎస్ కషి శ్లాఘనీయం. ఇంద్రపాలెంగా ఉన్న గ్రామం పేరును ఇంద్రపాలెంగా మార్చడంలో కెఎస్ ఆలోచన, కార్యాచరణే కారణం. సుందరయ్య అన్నట్టు 'కమ్యూనిస్టులమని అనుకుంటూ జీవిస్తూ ఉంటాము. కమ్యూనిస్టులం అవునో కాదో నిర్ణయించబడేది మరణం తర్వాతే". 2003 జనవరి 1న అకస్మాత్తుగా మతి చెందిన కెఎస్ నిజమైన కమ్యూనిస్టు. మచ్చ లేని జీవితం గడిపారు, ఎర్రజెండాకు వన్నె తెచ్చారు. కమ్యూనిస్టు పార్టీకి విలువ పెంచారు. ఇంద్రపాలెం చరిత్రలో పార్థీవదేహాన్ని మహిళలు భుజాన్న ఎత్తింది కెఎస్ విషయంలోనే. మొదటిసారి శ్మశానవాటికకు మహిళలు పెద్ద ఎత్తున వచ్చారు. కుడుపూడి సూర్యనారాయణ జీవితం సదా స్ఫూర్తిదాయకం. ఆయన మార్గం అనుసరణీయం. కెఎస్ స్మారక ట్రస్టు ఏర్పరచి, స్మారక భవనం నిర్మించి ఆయన ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించడం అభినందనీయం.

- పెద్దింశెట్టి రామకృష్ణారావు



తన కుమార్తె అనురాధ, శేషబాబ్జిల కులాంతర వివాహంలో మాట్లాడుతున్న కెఎస్. చిత్రంలో వివాహకర్త డాక్టర్ మిడియం బాబూరావు, గొల్లమూడి నాగేశ్వరరావు

భారీగా పెరిగిన ఇసుక, ఇటుక ధరలు

ప్రజాశక్తి - బిక్కవోలు

భారీగా పెరిగిన ఇసుక, ఇటుక ధరలతో ఇళ్ల నిర్మాణదారులు బెంబేలెత్తుతున్నారు. దీనికి తగ్గట్టు తాపీమేస్త్రీ కూలీలు కూడా రూ.400 నుంచి రూ.550 వరకు దాయడంతో మూలిగే నక్కపై తాడిపండు పడినట్టుంది ఇళ్ల నిర్మాణదారుల పని. పేద, మధ్యతరగతి వారికి సొంత ఇంటి కళకళగానే మిగిలిపోయేటట్లు ఉంది. ఈ మధ్య కొన్ని గ్రామాల్లో ఇంటి నిర్మాణ రుణాలు మంజూరుచేసింది. దీంతో చాలా మంది పేదల నీడకోసం ఇళ్లు నిర్మించుకోవడానికి సన్నద్ధమయ్యారు. అయితే వీరిని సిమెంట్, ఐరన్; ఇసుక, ఇటుక రేట్లు షాక్ కొడుతున్నాయి. మండలంలో తాపీమేస్త్రుల కొరత ఎక్కువగా ఉండడంతో వారు కూడా అమాంతం రోజువారి కూలీ పెంచేశారు. గృహనిర్మాణశాఖ అందించే ఆర్థికసాయం ఫౌండేషన్‌కే సరిపోతుందని ఇళ్ల నిర్మాణదారులు వాపోతున్నారు. మండలంలో సుమారు 15 ఇటుక బట్టీల వరకు ఉన్నాయి. బట్టీ యజమానులందరూ రింగు అవ్వడంతో ధరలు పెంచేశారు అనే విమర్శలు వస్తున్నాయి. ధరలు తగ్గితే ఇళ్లను నిర్మించుకుందామని చాలామంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఇసుక, ఇటుక ధరలు వర్షాకాలంలో పెరిగితరువాత సాధారణకు చేరుకుంటాయి. కానీ తగ్గలేదని ఇళ్ల నిర్మాణదారులు వాపోతున్నారు.

ధరల సమాచారం

కూరగాయల ధరలు (రైతు బజార్ నిన్నటివి)

కూరగాయలు	(కిలో రూ.	కూరగాయలు	(కిలో రూ.)
టమాటా	34	ఉల్లిపాయలు	25
వంకాయ	14	బంగాళాదుంప	11
వంకాయ(దొమ్మేరు)	14	చేమ, కంద	22, 20
వంకాయ(గులాబి)	12	అల్లం	32
పచ్చిమిర్చి	24	బొబ్బర్లు	24
బెండ	22	పొట్లకాయ	12
కాకరకాయ	22	ఆనబకాయ	10
బీరకాయ	18	అరిటికాయ	5
దొండకాయ	18	దోసకాయ	8
కాలీఫ్లవర్	-	కీరదోస	-
క్యాబేజీ	30	పెండలం	28
క్యారెట్	28	బీన్స్‌కాయ-గింజలు	64
చిక్కుళ్లు	32	క్యాప్సికమ్	64
గోరుచిక్కుళ్లు	34	చిలకడదుంప	17
		బఠాణి	26
		బీట్‌రూట్	48

నిత్యావసరాల ధరలు కిలో (రూ.)

కందిపప్పు	70
పెసరపప్పు	80
సెనగపప్పు	85
మినపప్పు	76
ఇడ్లీ రవ్వ	26
మైదా	30
బన్సీనూక	34
పెసలు	30
వెల్లుల్లి	100
పంచదార	42
బెల్లం	52
జీలకర్ర	125
ఆవాలు	45-50
గోకవరం చింతపండు	110
పువ్వు చింతపండు	96
ఎండుమిర్చి	100
వేరుసెనగుళ్లు	110

బియ్యం	50కిలోలు (రూ.)
పిఎల్.మసూరి	1500-1600
సోనామసూరి	1600-2000
కర్నూలు సోనా	1650-2000
బిపిటి	2100-2200
స్టీమ్ సోనా	1350-1600
కళ్యాణి	2700-2900

నూనెలు	కిలో(రూ.)
సన్‌ఫ్లవర్	80
వనస్పతి	66-78
వేరుశనగ	115
గానుగ నూనె	186
పామాయిల్	62
సోయాబీన్	75-80
రైస్‌బ్రాన్ ఆయిల్	65-80

బంగారం

24 క్యారెట్లు (10 గ్రా) 30,850

వెండి (కిలో) 38,575

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి క్వింటాళ్లలో	ధర (నిన్నటి) (రూ॥లలో)
కొత్త కొబ్బరి	10,000
రెండో రకం	
కురిడీ గండేరా (పాత)	11,500
గటగట (పాత)	7,500
గండేరా (కొత్త)	11,000
గటగట (కొత్త)	7,000
నీటికాయ(వెయ్యింటికి)	
పాత(ముక్కుడు)కాయ	10,000- 10,500
కొత్త(పచ్చి)కాయ	10,000- 11,500
కొబ్బరినూనె మార్కెట్	
15 కిలోలకు	2,100
1 కిలోకు	160

రావులపాలెం అరటి మార్కెట్

గెల ఒక్కంటికి (నిన్నటివి)

రకం	గరిష్టం రూ.	కనిష్టం రూ.
కర్పూర	350	200
చక్రకేళి (తెలుపు)	350	150
చక్రకేళి (ఎరుపు)	500	300
అమృతపాణి	340	250
భుషావళి (పచ్చ)	250	100
దేశవాళి (కూర అరటి)	300	100

అనపర్తి నాన్‌వెజ్ రూ.కిలో

ఫారం	రూ.90
రిటైల్ లైవ్	రూ. 105
బ్రాయిలర్	రూ.147
స్కిన్‌లెస్	రూ.173
కోడిగుడ్డు(రైతు ధర)	రూ.3.65
మటన్	రూ.420
చేప	రూ.150

రొయ్యల ధరలు - అమలాపురం

వనామీ ప్రాన్స్ (కిలో ఒక్కటింకి రూ.లలో) నిన్నటివి

20 కౌంట్ - 680	42 కౌంట్ - 380	51-60 - 340
25 కౌంట్ - 500	43- 45 - 380	63-70 - 300
30 కౌంట్ - 440	46-47 - 370	73-80 - 290
32 కౌంట్ - 420	50 కౌంట్ - 360	83-90- 270
40 కౌంట్ - 410		93-100 - 240

నేటి సినిమా


కాకినాడ : తిరుమల : టైగర్ జిందాహై **వీర్ కమల్ :** ఖాకీ **ఆనంద్ :** మళ్లీ రావా..., **అంజని :** సప్తగిరి ఎల్‌ఎల్‌బి, **సంగీత్ :** గృహం, **గీత్ :** టైగర్ జిందాహై, **దేవీస్క్రీన్ 1 :** ఎంసిఎ, **దేవీస్క్రీన్ 2 :** ఆక్సిజన్, **దేవీ స్క్రీన్ -3** ఇఈ, **శ్రీప్రియ :** ఎంసిఎ **పద్మప్రియ:** హలో **సిఅండ్‌సి-1** ఎంసిఎ, **సిఅండ్‌సి-2 :** హలో, **లక్ష్మి :** హలో, **సత్యగౌరి :** జవాన్

రాజమహేంద్రవరం :- శ్యామల : ది గ్రేట్, **కుమారి :** ఎంసిఎ, **అనుశ్రీ సినిమాస్ :** హలో, **రంభ:** టైగర్ జిందా హై, **ఊర్వశీ :** మళ్లీ రావా..., **మేనక :** గృహం, **స్వామి :** హలో, **అశోక :** ఎంసిఎ, **గీతాఅప్సర :** ఎంసిఎ, **శివజ్యోతి :** సప్తగిరి ఎల్‌ఎల్‌బి, **నాగదేవి :** ఎంసిఎ **సూర్యాప్యాలెస్ :** ఆక్సిజన్, **సూర్యామినీ :** టైగర్ జిందా హై, **రాజా :** హలో **విఎస్‌మహాల్ :** ఎంసిఎ,

ధవళేశ్వరం : మురళీ కృష్ణ : హలో

అమలాపురం : వెంకట పద్మావతి సినీ ఫ్లెక్స్ (వి.పి.సి) (స్క్రీన్1) : ఎంసిఎ, **స్క్రీన్ 2 :** హలో.. **శ్రీ వెంకటరమణ (ఎసి) :** సప్తగిరి ఎల్‌ఎల్‌బి **వెంకటరామ (ఎసి) :** ఇఈ, **శ్రీలలిత :** గృహం **శేఖర్ (ఎసి) (స్క్రీన్1 :** హలో, **స్క్రీన్ 2 :** ఎంసిఎ, **రమా(ఎసి) :** టైగర్ జిందాహై, **శ్రీగణపతి :** ఆక్సిజన్

రంపచోడవరం లలితా : ఎంసిఎ, **చింతూరు : ఓం నవయుగ టాకీస్** ఎంసిఎ, **రాజవొమ్మంగి : శ్రీవెంకటేశ్వర :** ఆక్సిజన్



దగ్ధమవుతున్న కారు

కారు దగ్ధం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కారులోంచి మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అమలాపురం వైపు నుంచి ఎస్ యానాం వైపు వెళుతున్న ఇండికా కారు చల్లపల్లి పంచాయతీ బొండాడి పేట సమీపంలోకి వచ్చేసరికి కారులోంచి మంటలు చెలరేగాయి. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఇరువురు వ్యక్తులు కారుదిగి వెళ్లిపోయారు. ఇది గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది.

ఎయిమ్స్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల రెండో తేదీ హోస్పిరా ఆస్ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఎండి వంశీవర్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొనేందుకు విద్యార్థులు డిప్లమో చివరి సంవత్సరం చదవాలని చెప్పారు. 2న ఉదయం 8గంటలకు తమ పేర్లను నమోదు చేసుకుని కంపెనీ నిర్వహించే రాత పరీక్ష, గ్రూప్ డిస్కస్‌ల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు.

బాలలకు పాలు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాదృక్పథం కలిగి ఉండటం ప్రశంసనీయమని తెలుగు యువత నాయకుడు ఆదిరెడ్డి వాసు, నగర అధ్యక్షుడు నక్కా దేవీవరప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఐదుగురు స్నేహితులు కలిసి ఏర్పాటు చేసుకున్న హ్యాండ్‌టూహ్యాండ్ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమంలో భాగంగా జియోన్ అంధుల పాఠశాలలో బాలబాలికలకు పాలు, బిస్కెట్లు ఆదివారం అందించారు. పుణ్యక్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం పూజారి గణేష్ తన పుట్టిన రోజు సందర్భంగా హ్యాండ్‌టూహ్యాండ్ సంస్థ ద్వారా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. నవంబరు 30న ఏర్పాటు చేసిన తమ సంస్థ ద్వారా అనాథలైన బాలబాలికలకు సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు సంస్థ సభ్యులు వి.సాయి, ఎ.చంద్రమౌళి, పి.సాయిరామ్, టి.చక్రధర్, కె.కిరణ్ తెలిపారు.

క్షతగాత్రులకు బండారు పరామర్శ

ప్రజాశక్తి - రావులపాలెం

గ్యాస్ సిలిండర్ బాధితులను మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఆదివారం పరామర్శించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెనుమాక వెంకటేశ్వరరావును, పెనుమాక సత్యవతిని, చిక్కం సరోజినిని, దూలం లక్ష్మిని, మండ వెంకటేశ్వరరావును పరామర్శించి 10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయనతో పాటు చైర్మన్ వేగేశ్న చంద్రరాజు, అంకంపాలెం సర్పంచ్ కరుటూరి నరసింహారావు ఉన్నారు.

జెవివి ఆధ్వర్యాన మద్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

నూతన సంవత్సరాన్ని మద్యం మత్తులో ఆహ్వానించవద్దని జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మురమళ్ల సెంటర్లో మానవహారం, ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మద్యం తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతారని, అప్పులు పాలవుతున్నారని, పిల్లల చదువులకు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. నూతన సంవత్సరం నుంచి మద్యం జోలికి వెళ్లనని అందరూ అనుకోవాలని అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయన్నారు. సమాజంలో మంచి గుర్తింపు సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్, కార్యదర్శి వి.శ్రీరామారావు, మండల పరిషత్ ఆఫీస్ సూపరిండెంట్ విహెచ్.సుబ్రహ్మణ్యం, ముత్తాబత్తుల నరసింహమూర్తి, ఎన్.కిరణ్‌కుమార్, రమేష్, మల్లబాబు, లక్ష్మణ్, పితాని శ్రీను గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సంవన్సరానికి మద్యం మత్తులో కాకుండా సమాజం గర్వించే ఏదైనా చిన్న మంచిపనితో స్వాగతం పలుకుదామని, ఇందుకు అందరూ సహకరించాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం అన్నారు. జెవివి అమలాపురం శాఖ



జెవివి ఆధ్వర్యంలో ర్యాలీ

ఆధ్వర్యంలో ఆదివారం బండారులంకలో నిర్వహించిన మద్యపాన వ్యతిరేక ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యం వ్యసనాలవల్ల సమాజం పతనంవైపు పరుగులు తీస్తుందన్నారు. ర్యాలీ సందర్భంగా జెవివి కరపత్రాలను పంచిపెట్టారు. తమ బిడ్డలు మందు పార్టీలకు వెళ్లకుండా కట్టడి చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో గ్రామపెద్దలు చింతా శంకరమూర్తి, ఉప్పుగంటి భాస్కరరావు, మాడా మాధవి, బాసిన శివనారాయణ, జెవివి నాయకులు బిఎస్.వెంకటేశ్వరరావు, జి.నాగేంద్రరాజు, జి.పుల్లయ్యశెట్టి, జి.స్వామిప్రసాద్, జి.రాధామాదవ్, విద్యార్థులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

సిఆర్‌సి ఆధ్వర్యాన కబడ్డీ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న సిఆర్‌సి అధ్యక్షులు

ప్రజాశక్తి - రావులపాలెం

కాస్మోపాలిటన్ రిక్రియేషన్ (సిఆర్‌సి) క్లబ్ ఆధ్వర్యంలో కోనసీమ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సిఆర్‌సి అధ్యక్షుడు మల్లిడి కనికిరెడ్డి, కార్యదర్శి అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సిఆర్‌సిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు దీనికి సంబంధించిన వివరాలు తెలిపారు. జనవరి 14 నుంచి 16వ తేదీ వరకు 3 రోజుల పాటు కోనసీమ స్థాయి కబడ్డీ పోటీలు పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురుషులు అండర్ 25, మహిళలు అండర్ 20 విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ఆయా మండలాల్లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పిడిలను సంప్రదించాలన్నారు. జనవరి 5వ తేదీన ఆయా మండలాల్లో క్రీడాకారులను ఎంపిక చేస్తారని చెప్పారు. వివరాలకు 9849256222 సంప్రదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కర్రి సుబ్బారెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, కుడుపూడి శ్రీనివాస్, మంతెన రవిరాజు, చెక్కల సూరిబాబు, సిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

'జన్మభూమి'ని జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి- ముమ్మిడివరం

ఈ నెల రెండో తేదీ నుంచి 1 వరకు జరిగే 5వ విడత జన్మభూమిని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఒ డి.రాంబాబు కోరారు. నగరంలో నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం 16 పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించాలని చెపాపరు. దీనిలో భాగంగా 2వ తేదీన సంక్షేమం, సంతృప్తి, 3న ఆరోగ్యం, ఆనం దంచ, 4న స్వచ్ఛాంధ్ర ప్రదేశ్, 5న విద్యా, వికాసం, 8న మౌళిక సదుపాయాలు, 7న సహజ వనరులు, అభివృద్ధి, 8న వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి, 9న సుపరిపాలన టెక్నాలజీ వినియోగం, 10న విజన్ స్వర్ణాంధ్ర ప్రదేశ్, పేదరికంపై గెలుపు, 11న ఆనంద లహరిలతో పాటు 7న అన్ని పంచాయతీలలో జరిగే 5కె రన్‌లో అన్ని శాఖలు పాల్గొనాలని కోరారు.

ఐ.పోలవరం : ప్రజలు ఎదుర్కోంటున్న వివిధ సమస్యలను అక్కడకక్కడే పరిష్కరించేందుకే ప్రభుత్వం 5వ విడత జన్మభూమి-మాఊరు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ఆదివారం మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద నాలుగు మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతిగ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని పండగవాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ గోలకోటి దొరబాబు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ చెల్లి శాంతఅశోక్, ముమ్మిడివరం ఎంపిపి పితాని సత్యనారాయణ, తాళ్లరేవు ఎంపిపి చేతుమూడి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

రావులపాలెం : ఈ నెల 2 నుంచి 10 వరకు జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని మండలంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వై.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 2న ముమ్మిడివరప్పాడు, కేతరాజుపల్లి, 3న వెదిరేశ్వరం, 4న దేవరపల్లి, 5న ఈతకోట, 6న రావులపాడు, లక్ష్మీపోలవరం, 7న పొడగట్లపల్లి, 8న గోపాలపురం, 9న రావులపాలెం, 10న కొమరాజులంక, ఊబలంక గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఐక్య ఉపాధ్యాయుల ఫెడరేషన్ గోకవరం మండల శాఖ ఆధ్వర్యంలో హన్నా విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.సువర్ణకుమార్ యుటిఎఫ్ డైరీని, క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల డైరీని, క్యాలెండర్లను ఎల్ఐసి సూర్యప్రకాశరావు, ఎస్.జానకిరామారావు, లీవ్ బుక్స్‌ను, ఫోన్‌బుక్స్‌ను ఎల్ఐసి డిఒ సుధీర్‌ప్రసాద్ ద్వారా మండల ఉపాధ్యాయులందరికీ పంపిణీ చేశారని యుటిఎఫ్ అధక్షులు ప్రధానకార్యదర్శులు ఎస్.అనిల్‌కుమార్, ఎ.గాంధీ తెలిపారు. యుటిఎఫ్ జానత్వాన్ని చాటిచెబుతూ మండలశాఖ సామాజిక స్ఫూర్తితో చేసే పనులకు ఇలాంటి సహకారం దాతలు తప్పనిసరిగా అందించాలని యుటిఎఫ్ అకాడమిక్ సెల్ కన్వీనర్ టిఎస్‌వివిఎస్ఎస్.సాయిబాబ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బి.వెంకటరమణ, ట్రెజరరీ కె.నాగభూషణం, ఆఫీసర్ బ్యానర్స్ ఎం.పార్థ,



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సువర్ణకుమార్ తదితరులు

సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, డి.అప్పారావు, జిల్లా అడిటర్ ఆర్.హరినాధ్, ప్రేమ్‌కుమార్, కేశవచార్యులు, ఎన్ఎస్.రత్నరాజు, దొర, 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయుల ఉద్యమనేత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభను నిర్వహించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

మునిపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు నిమ్మకాయల తులసమ్మ(101) ఆదివారం మృతి చెందింది. ఈమెకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు, మనమలు, మునిమనమలు కలిపి 34 మంది ఉన్నారు. ఆమె మృతికి ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, జెడ్‌పిటిసి సభ్యులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఎఎంసి చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, అల్లవరం డిసి చైర్మన్ నిమ్మకాయల చెల్లయ్య నాయుడు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

రాజమహేంద్రవరం లాలా చెరువు వద్ద నూరాని మసీదు మౌజన్(చిన్నగురువు)ను అతి కిరాతంగా హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ముస్లిం సంఘ నాయకుడు, వైసిపి అమలాపురం పట్టణ అధ్యక్షులు ఎస్ఎ.ఖాదర్ డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో అలజడి సృష్టించటానికి ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, రూ.20 లక్షలు బాధిత కుటుంబానికి అందించి ఆదకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో పోలీసులు నిష్పాక్షిపాతంగా విచారణ జరిపి దోషులను ఎంతటివారైనా అరెస్టుచేసి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ముస్లిం సంఘ పెద్దలు కోరారు. ఈ సమావేశంలో రజా అబ్బాస్, షబ్బీర్, కర్రార్, మూసా హుస్సేన్, మున్నా ఇమ్రాన్, వఫా అబ్బాస్, బజాజ, అబాబ్బస్ అలీ షహింషా, ఖాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

మసీదులో హత్యపై ఎంపీ ఖండన

ప్రజాశక్తి - అమలాపురం

రాజమహేంద్రవరం నగరం లాలాచెరువు ప్రాంతంలోని ప్రార్ధనా మందిరంలో జరిగిన మహమ్మద్ ఫరూక్ దారుణ హత్యను అమలాపురం పార్లమెంటు సభ్యులు డాక్టర్ పండుల రవీంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఈ ప్రాంతంలో ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా మత విద్వేషాలను రెచ్చగొట్టే సంస్కృతి లేదని, ప్రజలందరూ సామరస్యంతో మెలగాలనేదే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ మేరకు పార్లమెంటు సభ్యులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి జరిగిన సంఘటనపై తీవ్రంగా స్పందిస్తూ పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. నిందితులను అతి త్వరలో పట్టుకుంటారని వివరించారు.

నూతన సంవత్సర వేడుకల సందడి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని పలుగ్రామాల్లో నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లోని వ్యాపార కూడళ్లలో వ్యాపారాల జోరు అందుకుంది. పలావు సెంటర్లు దగ్గర నుంచి పువ్వులు, భుకేల దుకాణాలతో పాటు రంగుల దుకాణాలు వెలిసి బిజిబిజీగా తయారయ్యాయి. చర్చిలను ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్ధనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రావులపాలెం : మసీదులో హత్యకు గురై మృతి చెందిన మౌజాన్ ఆత్మకు శాంతి కలగాని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో శాంతి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. హత్యకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోట చెల్లయ్య, జెడ్‌పిటిసి సభ్యులు సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ, వైసిపి జిల్లా కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, గొలుగూరి మనిరెడ్డి, దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీను, ఎంపిటిసి సభ్యులు బొక్కా ప్రసాద్, కొండేపూడి రామకృష్ణ, రియాజ్ పాషా, మస్తాన్, అబ్దుల్ కరీమ్, భాషా, సుభహాని, ఖయ్యూమ్, ఎస్‌కెవలి, వలిబాబా, వైసిపి కార్యకర్తలు, నాయకులు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవత్సరానికి ... విరిసిన సోయగం...



ప్రజాశక్తి-కడియం

కడియం నర్సరీలు నూతన వత్సరానికి ముస్తాబయ్యాయి. పల్లవెంకన్న నర్సరీలో 2018 నయా సంవత్సరానికి పలువర్ణాలతో వివిధ రకాల ఆకృతులతో స్వాగతం పలికారు. ఏ సందర్భం వచ్చినా తమదైన రీతిలో వినూత్నంగా స్పందించే పల్ల వెంకన్న నర్సరీ యాజమాన్యం ఈ నూతన సంవత్సరానికి మేక్ ఇన్ ఇండియా 2018 స్టార్ట్ అను ఆకృతిని మొక్కలతో అలంకరించారు. సుమారు 80 వేల మొక్కలతో ఐదు రోజుల పాటు శ్రమించి ఈ ఆకృతిని తీర్చిదిద్దారు. అలాగే మన నవ్యాంధ్ర రాజధాని అమరావతి అసెంబ్లీ భవన నమూన ఖరారైన సందర్భంగా అసెంబ్లీ ఆకృతిని అందమైన పూల మొక్కలతో శోభీయమానంగా తీర్చిదిద్దారు. వీటితోపాటు మొక్కలతో మనిషి, హంస, సీతాకోక చిలుక బొమ్మలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఆకృతులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా నర్సరీ యాజమాన్యం వల్లుడుతూ బంధుమిత్రులకు ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సరం కొత్త నిర్ణయాలు తీసుకుని విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు పూలతోనూ, మొక్కలతోనూ నూతన సంవత్సర శుభాకాంక్షలు ఇచ్చేందుకు అత్యంత వ్యయప్రయాసమైన ఈ ఏర్పాటు చేశామని రైతులు చెబుతున్నారు.





నేతలు.. ఆశల ఊసులు..

నవ వసంతలోకి ఎన్నో ఆశలతో ప్రవేశిస్తున్నాం.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకుంటామని బాసలు చేసిన నేతలు ఏ మేరకు సఫలీకృతమయ్యారో, నూతన సంవత్సరంలో వారి ప్రణాళికలు ఏమిటో తెలుసుకునేందుకు ప్రజాశక్తి ప్రయత్నించింది. 2018లో వారు చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను నేతలు వివరించారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదికి సంబంధించి వారి బాసలు, ఊసులు మీ ముందుంచుతున్నాం.

- తూర్పు డెస్క్

కొత్త ప్రణాళికలతో అభివృద్ధి చెందాలి



నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా అందరికీ నూతనసంవత్సర శుభాకాంక్షలు. కొత్త ఏడాదిలో ప్రజలు కొత్త ప్రణాళికలతో మరిన్ని విజయాలు అందిపుచ్చుకోవాలి. ఈ సంవత్సరం అందరికీ మేలు జరగాలని ఆకాంక్షిస్తున్నాను. కోట్లాది రూపాయలు అభివృద్ధికి ఖర్చుచేశాం. కొత్త ఏడాది అభివృద్ధి విషయంలో అన్ని వర్గాలకూ మేలుజరిగేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాను.

తోట నరసింహం, ఎంపీ, కాకినాడ

రైల్వే ప్రాజెక్టు సాధన ప్రజలకిచ్చే కానుక



నూతన సంవత్సరంలో రైల్వే ప్రాజెక్టు సాధించుకోవడమే ప్రజలకు నేనిచ్చే కానుక. కొత్త ఏడాదిలో పార్లమెంట్ మరింత అభివృద్ధి కానుంది. రైల్వే ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుంది. కోనసీమ అభివృద్ధికి ఎగుమతులు పెంచేందుకు కృషి చేస్తా. కోన సీమను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో చర్చించి అభివృద్ధి చేస్తాను.

డాక్టర్ పండుల రవీంద్రబాబు, ఎంపీ, అమలాపురం

కాకినాడను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతా



కాకినాడను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధంచేశాం. నగరంలోని రోడ్లు, డ్రెయిన్లు కల్వర్టుల అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం. నగరంలోని ప్రజలందరికీ 24 గంటలు తాగు నీరు అందిస్తాం. కొత్తసంవత్సరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

వనమాడి కొండబాబు, ఎంఎల్‌ఎ, కాకినాడ సిటీ

అండర్ గ్రౌండ్ డ్రెయిన్ల ఏర్పాటు



నియోజకవర్గాన్ని రూ.500 కోట్లతో అభివృద్ధి చేశా. మారుమూల గ్రామాలకు సిసి రోడ్లను ఏర్పాటు చేశా. సర్పవరం నుంచి వనసపాడు, ఇంద్రపాలెం నుంచి కొవ్వాడ, కరప నుంచి అరట్లకట్ట, వేళంగి నుంచి కాపవరం మెయిన్ రోడ్లను నిర్మించాం. అండర్‌గ్రౌండ్ డ్రెయిన్స్ నిర్మిస్తాం. పూర్తిస్థాయిలో మత్స్యకారుల పిల్లల చదువు కోసం రెండు రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తాం.

పిల్లి అనంతలక్ష్మి, ఎంఎల్‌ఎ, కాకినాడ రూరల్

స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తా



రాజమహేంద్రవరంలో క్రీడామైదానాన్ని ఈ ఏడాదిలో నిర్మించి తీరుతాం. అమృత పథకంలో ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన నీరందించడమే లక్ష్యంగా పనిచేస్తాం. దీనికి రూ.82.31 కోట్లు ఖర్చుచేయనున్నాం. ఇప్పటికే టెండర్లు పిలిచాం. చారిత్రక గ్రంథాలు కలిగిన గౌతమీ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తాం. నగరంలోని పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం.

డాక్టర్ ఆకుల సత్యనారాయణ, సిటీ ఎంఎల్‌ఎ, రాజమహేంద్రవరం

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాను. 21 గ్రామాలకు రక్షితనీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ కోసం ప్రతిపాదనలు రూపొందించాం. కడియం నర్సరీ రైతులకు రాయితీలు కల్పించేలా కృషిచేస్తాం. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.

గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రూరల్ ఎంఎల్‌ఎ, రాజమహేంద్రవరం

ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా



ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తాను. ఎస్‌సి కమ్యూనిటీ హాలు, చల్లపల్లిలో ఒసి కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతాము. ఎస్‌సిల కోసం స్టడీ సెంటర్‌ను నెలకొల్పి పోటీ పరీక్షలకు వెళ్లేందుకు నిరుద్యోగుల కోసం శిక్షణ కేంద్రం నెలకొల్పుతాను. పూర్తిస్థాయిలో నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

అయితాబత్తుల ఆనందరావు, ఎంఎల్‌ఎ, అమలాపురం

పేదలందరికీ ఇళ్లు అందిస్తాం



నియోజకవర్గంలో ఉన్న పేదలందరికీ సొంతిల్లు అందేలా కృషి చేస్తాను. అర్హులందరికీ పింఛను, రేషన్ కార్డులు అందిస్తాం. నియోజకవర్గంలోని గ్రామాల్లో లింక్ రోడ్లతో పాటు డ్రెయినేజీ, తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాను. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాను.

వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్‌ఎ, మండపేట

అభివృద్ధి కార్యక్రమాలతో సస్యశ్యామలం



రాజోలు నియోజకవర్గాన్ని మరిన్ని అభివృద్ధి పనులతో సస్య శ్యామలం చేస్తాం. 2018లో లబ్ధిదారులందరికీ రుణాలు మంజూరుచేసి పూర్తాస్థాయిలో తోడ్పాటునందిస్తాం. అంతర్వేదిలో రూ.23 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించనున్నాం. నియోజకవర్గంలో అన్ని రంగాలకూ ప్రాధాన్యతిచ్చి ఆదర్శంగా తీరిదిద్దుతాం. అన్ని గ్రామాల్లోనూ సిసిరోడ్లు నిర్మించనున్నాం.

గొల్లపల్లి సూర్యారావు, ఎంఎల్‌ఎ, రాజోలు

మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు



ప్రజలకోసం ఒక సేవకునిలా పనిచేస్తాను. పి.గన్నవరంలో రూ. 50 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తాం. పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తాం. ఊడిమూడిలంక (బూరుగులంక)లో బ్రిడ్జి నిర్మాణం, లంకలగన్నవరం, ముంజవరంలో వంతెన నిర్మాణాలను చేపట్టనున్నాం. 2 వేల పింఛన్లను జన్మభూమి కార్యక్రమం నుంచి అందజేస్తాం.

పులపర్తి నారాయణమూర్తి, ఎంఎల్‌ఎ, పి.గన్నవరం

దళిత గ్రామాల అభివృద్ధికి కృషి



ఎస్‌సి గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.11.50 కోట్లు టెండర్లు ఖరారు అయ్యాయి. పశవుల్లంక -సలాది వారిపాలెం వంతెనకు సిఎం శంకుస్థాపన చేయనున్నారు. అనాతవరం, పల్లంకుర్రు ప్రధాన రహదారికి సిఆర్‌ఎఫ్ గ్రాంటుగా విడుదలైన రూ.25 కోట్లతో విస్తరణ పనులు ప్రధానంగా చేపడుతున్నాం.

దాట్ల సుబ్బరాజు, ఎంఎల్‌ఎ, ముమ్మిడివరం


నిత్యం అందుబాటులో ఉండి సేవలందిస్తా



నియోజకవర్గంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి ప్రజల కష్టాలను తీరుస్తాను. తుని పట్టణంలో రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సమస్యలను తీర్చడానికి డిజిటల్ ట్రాఫిక్ కంట్రోల్ పద్ధతిని ప్రవేశపెడతాం. 2013లో చంద్రబాబు రాక్షస పరిపాలనకు రాష్ట్ర ప్రజలు ముగింపు పలకాలని ప్రజలకు సూచించారు.

దాడిశెట్టి రాజా, ఎంఎల్‌ఎ, తుని

అర్హులందరికీ ఇళ్లస్థలాలందిస్తాం



నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యం. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తాం. గ్రామాల్లో కనీస సౌకర్యాలు, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు కల్పిస్తున్నాం. విద్య, వైద్యం అందరికీ అందిస్తున్నాం. నియోజకవర్గ పరిధిలోని రంగంపేట బిక్కవోలు, పెద్దపూడికి ఇళ్లస్థలాలు మంజూరు చేశాం. అనపర్తిలోనూ త్వరలో మంజూరు చేస్తాం.

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంఎల్‌ఎ, అనపర్తి

ప్రత్యేక నిధులు రప్పిస్తా..



నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షిస్తున్నాం. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అహర్నిశలూ కృషి చేస్తున్నాం. ప్రతిగ్రామాన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నాం.

జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), ఎంఎల్‌ఎ, జగ్గంపేట

ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి



75 శాతం రోడ్లను ఇప్పటికే అభివృద్ధి చేశాం. జగ్గయ్య చెరువు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రూ.3 కోట్లతో పనులు చేపట్టాం. పురుషోత్తపట్టణాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. ఆర్ఆర్‌బి హెచ్.ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధునికీకరణకు రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. ఉచితంగా ఎంసెట్ కోచింగ్‌ను ప్రారంభిస్తాం.

ఎస్‌వి.ఎస్.ఎన్.వర్మ, ఎంఎల్‌ఎ, పిఠాపురం

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ప్రజాసంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషిచేస్తాను. సమస్యలను పరిష్కరిస్తాను. ప్రతిపక్షంలో ఉన్నందు వల్ల అభివృద్ధి చేయలేకపోతున్నాం. ఇళ్లస్థలాలను అర్హులు అందజేసి వారి గృహ నిర్మాణం, తాగునీరు, రోడ్ల పూర్తి చేస్తాం. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు మహిళలు, రైతులు, యువతరానికి ఉపయోగపడతాయి వాటిని అమలు జరిగేల కృషి చేస్తాం.

చిర్ల జగ్గిరెడ్డి, ఎంఎల్‌ఎ, కొత్తపేట

రూ.25 కోట్లతో రోడ్డు నిర్మిస్తాం



నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఇప్పటికే నియోజకవర్గంలో 4 నెలల నుంచి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి కంటి, గుండె ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నాం. కొత్త సంవత్సరంలో ఏలేశ్వరం నుంచి శాంతి ఆశ్రమం రూ.25 కోట్లతో రోడ్డు నిర్మిస్తాం. లింగంపర్తిలో రూ.2 కోట్లతో కాపు కల్యాణ మండపాన్ని నిర్మిస్తాం.

వరుపుల సుబ్బారావు, ఎంఎల్‌ఎ, ప్రత్తిపాడు

గోదావరి నీరు అందించేందుకు కృషి



అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నియోజకవర్గంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలనేదే నా ఆకాంక్ష. సీతానగరం మండలంలో ప్రజలకు గోదావరి ద్వారా తాగునీరు అందిస్తాం. ఇవ్వడం, కోరుకొండలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు, రాజానగరం మండలంలో మిగిలిన గ్రామాలకు గోదావరినీరు అందిస్తాం.

పెందుర్తి వెంకటేష్, ఎంఎల్‌ఎ, రాజానగరం

అపు'రూపం' నూతన వేడుకలు..

ప్రజాశక్తి - అనపర్తి

నూతన సంవత్సర వేడుకలు అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో అపురూపంగా జరిగాయి. పాఠశాలలో చదువుతున్న ఏడుగురు కవలల (14 మంది) జంటలతో ఈ వేడుకలను చేయడం అందరినీ ఆశ్చర్యపర్చింది. ప్రతి పాఠశాలలోనూ కవల పిల్లలు చదవడం సహజం. అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో ఏడుగురు కవలలు చదువుతున్నారు. ఇందులో నలుగురు కవలలు ఒకరితో ఒకరిని పోల్చడం చాలా కష్టం. ఏడుగురు కవలలు ఉండడం ఒక ఎత్తయితే అందులో నలుగురు కవలల పేర్లు రాముడు, లక్ష్మణుడు కావడం విశేషం. 2018 సంవత్సర వేడుకలు వినూత్నంగా ఈ ఏడుగురు కవలల జంటలతో పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.సత్తిరెడ్డి కేక్ కట్ చేయించి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.



కవలలతో కేక్ కట్ చేయిస్తున్న హెచ్ఎం


న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధం




అమ్మకానికి సిద్ధంగా ఉన్న బుకేలు

న్యూ ఇయర్ వేడుకలకు రాజమహేంద్రవరం సిద్ధమైంది. ఇప్పటికే మార్కెట్‌లోకి శుభాకాంక్షలు చెప్పేందుకు బుకేలు, గిఫ్ట్‌లు సిద్ధమయ్యాయి. ముగ్గులకు రంగులు సిద్ధమయ్యాయి. 2018 డైరీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గతం కంటే ఈ ఏడాది ఈ ధరలు బగ్గుమంటున్నాయి. చిన్న బుకే ఫ్లవర్ రూ.30 నుంచి రూ.70కి అమ్ముతున్నారు.

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం అర్బన్
















కోడి పందేలకు సిద్ధమవుతున్న జూదరులు

జాతి పుంజుల కోసం వెతుకులాట

ప్రజాశక్తి - మధురపూడి

సంక్రాంతి పర్వదినం సమీపిస్తుండటంతో పందెం రాయుళ్లు కోడి పందేల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఒక వైపు బరులు సిద్ధం చేస్తునే మరో వైపు జాతి పుంజుల కోసం గాలిస్తున్నారు. పుంజు వయస్సు, రంగులను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. కోడి పందేలపై హోంమంత్రి చిన్న రాజప్ప సానుకూలంగా ఉన్నట్టు సంకేతాలు ఉండడంతో పందెం రాయుళ్ళు ఉత్సాహంగా వ్యవహరిస్తున్నారు. కోరుకొండ మండలంలోని గాడాల, మధురపూడి, రాజానగరం మండలంలోని కోలమూరు, గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాట్లపై బిజీగా ఉన్నారు. ఎర్రడేగ, నెమలి, పర్ల, పూల, కోడి డేగ, కోడి, సేతువ,డేగ, కాకి డేగ, కాకి, పచ్చకాకి, నల్ల మచ్చల సేతువు, పచ్చ, గాజు కత్తిరాయి, కాకి పెట్ట మర్ర, వంటి జాతి పుంజుల కోసం పందెం రాయుళ్ల వెతుకులాట ప్రారంభించారు. వీటి రంగు, వయస్సు, జాతిని బట్టి ధర నిర్ణయిస్తారు. ఈ జాతి పుంజులు రెండు వేల నుంచి ఇరవై వేల వరకు ధర పలుకుతుంది. వీటిని ఆరు నెలల ముందు నుంచే ప్రత్యేకంగా పెంచుతారు. ప్రత్యేక ఆహారంతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయింత్రం వ్యాయమం కూడా చేయిస్తారు. కొంత మంది చోళ్లు, గంటెళ్లతో పాటు బాదం, జీడి పప్పు వంటి మేనుతో ప్రత్యేకంగా పెంచుతారు. పందెం పుంజు పందెం కొట్టినా..ఓడినా గిరాకీయే. ఓడిన పుంజు మాంసం కోసం ఎగబడతారు. పందెం కోసను ఎంత పెట్టుబడి పెట్టి అయినా కొనుగోలు చేస్తారు.

నగరంలో న్యూ ఇయర్ ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం అర్బన్

రాజమహేంద్రనగరంలో న్యూఇయర్ ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. నగరంలో ఆదివారం మార్కెట్లో, సందడి నెలకొంది. పూల మార్కెట్లలో బొకేలు సిద్ధంచేసి విక్రయిస్తున్నారు. పూల బొకేలు రూ.10 నుంచి రూ.1000 ల వరకూ సిద్ధంగా ఉన్నట్లు పూల వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్లో ముగ్గులు వేసుకోవడానికి వాడే పలు రకాల రంగులు ఎక్కడికక్కడ విక్రయిస్తున్నారు. పండ్లు ప్రధానంగా యాపిల్, కమలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పూలు, పండ్లు, స్వీట్స్ ధరలు పెరిగాయి. బిర్యాని సెంటర్లో న్యూఇయర్ ప్యాకేజీలతో విక్రయాలు చేస్తున్నారు. ఆఫర్ రేట్లతో డిస్‌ప్లేలు పెట్టారు. బేకరీ షాపుల్లో కేక్‌ల కొనుగోలు ఊపందుకుంది. నగరంలో పలు హోటళ్లో వినోదకార్యక్రమాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆనంద్‌రీజన్సీలో జబర్దస్త్ టీంతో వినోదకార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇంటర్‌నేషనల్ పేపరుమిల్లు ఉద్యోగులు న్యూఇయర్ సెలబ్రేషన్స్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు తమ స్నేహితులకు, గురువులకు, రాజకీయ పార్టీల కార్యకర్తలు తమ నాయకులకు, ఉద్యోగులు తమ అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందుగానే వాటికి కావాల్సిన సామగ్రిని విక్రయించుకుంటున్నారు. అపార్టుమెంట్లో సభ్యులందరూ కలిసి వినోదకార్యక్రమాలను తమ పిల్లలతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ న్యూఇయర్ ఏర్పాట్లు చేసుకున్నారు.



బొకేలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

గత జన్మభూమిలో సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల రెండో తేదీన నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో ప్రజా సంక్షేమ పథకాలను, ప్రజా సమస్యలను పట్టించుకుని పరిష్కారం జరిగేటట్లు చూడాలని 31వ వార్డు కార్పొరేటర్ మజ్జి నూకరత్నం, నగర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మజ్జి అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా రేషన్‌కార్డులు కొత్తగా మంజూరయ్యాయని, ఈ కార్డులు జన్మభూమి కార్యక్రమంలో పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రభుత్వం వారు ఆ కార్డుల లిస్టులను విడుదల చేశారని, అందులో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అందరికీ కాకుండా కొంతమందికి మాత్రమే వచ్చాయని చెప్పారు. జాబితా కూడా తప్పులతడకగా ఉందని చెప్పారు. కృటికైనా ప్రభుత్వం హడావుడిగా కాకుండా తప్పులు లేకుండా కార్డులు మంజూరు చేయాలని కోరారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పింఛన్ల కోసం ఎదురుచూస్తునే ఉన్నారన్నారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

ఇందిరా సత్యనగర్ సమస్యపై 2న అఖిలపక్షం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక 44, 47 వార్డుల పరిధిలోని ఇందిరాసత్యనగర్ వాసుల సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరేందుకు జనవరి2వ తేదీన అఖిలపక్షంగా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లాలని నిర్ణయించినట్లు బిసి సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కొల్లివెలసి హారిక తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను అపాయింట్‌మెంట్ తీసుకున్నామని తెలిపారు. ఇందిరాసత్యనగర్‌వాసుల సమస్యపై జిల్లా కలెక్టర్‌ను కలిసే అఖిలపక్షం బృందానికి కన్వీనర్‌గా లోక్‌సత్తా నాయకులు ఎంవి.రాజగోపాల్ వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. ఇందిరాసత్యనగర్‌వాసుల దీక్షలు ఆదివారం నాటికి 21వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కొల్లివెలసి హారిక మాట్లాడారు. దీక్షా శిబిరాన్ని లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎంవి.రాజగోపాల్, మైనార్టీ నాయకులు రజాక్, మహిళా సమాఖ్య నాయకురాలు యడ్ల లక్ష్మి, ఐఐకెఎంఎస్.నాయకులు జె.సత్తిబాబు, ఐఎఫ్‌టియు నాయకులు సిహెచ్.వెంకటేశం, రైతుకూలీసంఘం నాయకులు భీమశంకరం, నలబాటి శ్యామ్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.



దీక్షలో పాల్గొన్న హారిక

ఎండుగడ్డికి పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - కాజులూరు

ఈ ఏడాది ఎండు గడ్డికి డిమాండ్ పెరిగింది. ఎకరా ఎండుగడ్డికి రూ.6వేలు నుంచి రూ.8వేలు వరకూ పలుకుతోందది. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలంటే ఈ ధర రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకూ వసూలు చేస్తున్నారు. యంత్రాలతో కోతలను నిర్వహించడంతో ఎండిగడ్డి కొరత తీవ్రమైంది. దీనికి తోడు ఇతర జిల్లాల నుంచి కూడా ఎండిగడ్డికోసం ఇక్కడికి వస్తున్నారు. దీంతో దీనికి డిమాండ్ పెరిగింది. ఎక్కువగా విశాఖకు ఎండిగడ్డి ఎగుమతి అవుతుంది. దాణాను కూడా ప్రభుత్వం సరిగా సరఫరా చేయట్లేదు. దీంతో పాడిరైతులు ఎండిగడ్డిని ఆశ్రయిస్తున్నారు. ఇది కూడా ఎండిగడ్డి డిమాండ్‌కు ఒక కారణంగా తెలుస్తోంది. గడ్డికి డిమాండ్ ఉండటంతో మండలంలో కోతలన్నీ కూలీలను ఉపయోగిస్తున్నారు.

రైజింగ్ బృందానికి రూప అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగర సుందరీకరణతో పాటు ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతున్న రాజమహేంద్రవరం రైజింగ్ బృందం యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పురమందిరం ప్రక్షాళనకు పూనుకోవడం ప్రశంసనీయమని మాగంటి రూప అన్నారు. వీరేశలింగం పురమందిరంలో రాజమహేంద్రవరం రైజింగ్ బందం చేపట్టిన సుందరీకరణ పనులను రూప ఆదివారం పరిశీలించారు. సెలవు రోజులో సరదాలకు కాకుండా సమాజ శ్రేయస్సు కోసం, సుందరీకరణ కోసం సమయాన్ని కేటాయించి కషి చేయడం అభినందనీయమన్నారు. మార్గదర్శకంగా నిలుస్తున్న ఈ కార్యక్రమంలో తాను కూడా ఒక వలంటీర్‌గా పాల్గొంటానని చెప్పారు. పురమందిరానికి పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కషి చేస్తానన్నారు. ఇప్పటివరకు రాజమహేంద్రవరం రైజింగ్ బందం చేసిన కార్యక్రమాలను, పుర మందిరం పాముఖ్యతను రైజింగ్ అడ్మిన్ మాటూరి సిద్దార్థ వివరించారు. ఈ కార్యక్రమంలో మాటూరి సౌమ్య, మద్ది నారాయణరావు, మండవిల్లి హరనాధ్, నామన శ్రీకాంత్, బండ్ల శంకర్ పాల్గొన్నారు.

6వ వార్డులో స్వచ్ఛత ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం అర్బన్

స్థానిక 6వ వార్డు అన్నపూర్ణమ్మపేటలో ఆదివారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మురుగుదొడ్ల గొట్టాలకు నెట్‌లను తొడిగారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మజ్జిమోనికాసుధారాణి మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని, తడి, పొడి చెత్తలను వేరువేరుగా శానిటరీ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. దోమలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు. మజ్జిరాంబాబు, కర్రిరాంబాబు, ఆదిత్యవిద్యాసంస్థల డైరక్టర్ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి జివిఎస్.నాగేశ్వరరావు, స్కూల్స్ సూపర్‌వైజర్ పి.దుర్గాప్రసాద్, హెచ్ఎం వి.సూర్యనారాయణ, ఆదిత్య విద్యాసంస్థల విద్యార్థులు, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, శానిటరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి'లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం అర్బన్

రాజానగరం మండలం కానవరం గాయత్రి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థ కరస్పాండెంట్ వివిఎస్ఎస్.మూర్తి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు దిశానిర్దేశం చేశారు. ప్రిన్సిపల్ వి.దేవిబంగారం మాట్లాడుతూ గత అనుభవాలతో భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు.

కోరుకొండ : మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు వారివారి స్థాయిల్లో సన్నాహాలు చేస్తున్నారు. కోరుకొండలో అన్ని గ్రామాల ప్రజలు రావడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. పలావు దుకాణాలు, రంగుల దుకాణాలు, బేకరీలు జనంతో పండుగ వాతావరణాన్ని తలపించాయి. కోరుకొండ ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేసి అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా చేస్తున్నట్లు ప్రతి గ్రామానికి నలుగురు సిబ్బందిని ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎంపిపి బుద్దా నూకరత్నం, జెడ్‌పిటిసి సభ్యులు మళ్ల అప్పలనరసారావు, రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తనకాల నాగేశ్వరరావు, మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో దేవాదాయశాఖమంత్రి

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని నల్లచెరువు గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి రాలేకపోయిన కారణంగా ఆదివారం దేవాదాయ శాఖామంత్రి పైడికొండల మాణిక్యాలరావు వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ రాంబాబు, బిజెపి రాష్ట్ర శిక్షణా అధ్యక్షులు వేటుకూరి వెంకట సూర్యనారాయణరాజు ఉన్నారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గోకవరం

ఎస్‌టియు క్యాలెండర్‌ను, డైరీని గోకవరం ఎంపిపి ఈది రత్నాజ్యోతి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి జెడిఐజె.దానియేల్ బాబు మాట్లాడుతూ ఎస్‌టియు సభ్యులుగా ఉండడం ఉపాధ్యాయులకు గర్వకారణమన్నారు. మండల శాఖ అధ్యక్షులు ఎస్.ప్రభాకరావు, ఉన్నత పాఠశాల అధ్యక్షులు పెదిరెడ్డి రాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు ఎస్‌టియు క్యాలెండర్స్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఎస్‌వివిఎస్.రవిశర్మ, ఎస్.రామకృష్ణ, ఎస్.బాబురావు, కె.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మధురపూడి :ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ సంఘం జిల్లా క్యాలెండర్‌ను ఆదివారం కోరుకొండ గాడాల గ్రామంలో డాక్టర్ అనసూరి పద్మలత ఆవిష్కరించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొర్రా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డి.పద్మావతి, సంఘ పెద్దలు భోనే ఉదయకుమార్, బి.కుమారీ, యాళ్ల ఉమాదేవి, గొల్ల చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గన్ని కృష్ణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అమెరికా పర్యటన ముగించుకుని మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న గుడా ఛైర్మన్ గన్నికృష్ణకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. దళితరత్న కాశి నవీన్‌కుమార్, ఉప్పులూరి జానకిరామయ్య, జాలా మదన్, చిట్టూరి ప్రవీణ్‌చౌదరి, నిమ్మలపూడి గోవింద్, ఎ.సైదుబాబు, కంటిపూడి శ్రీనివాస్, కోడూరి సంజీవ్, పరిటాల కిషోర్, కరుటూరి అభిషేక్, అనిల్ చౌదరి, కవులూరి వెంకట్రావు, మళ్ల వెంకట్రాజు, కంచిపాటి గోవింద్, మహబూబ్ జానీ, దోనెపూడి సుమన్, కొత్తూరి బాల నాగేశ్వరావు, వంకా శ్రీనివాస చౌదరి, విశ్వనాధరాజు, పుట్టా దొరబాబు, వారాది హనుమంతరావు, శనివాడ అర్జున్, ఎస్.ఎ.రషీద్, గుడా ప్లానింగ్ ఆఫీసర్ సంజయ్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యమూర్తి, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రసాదరావు, పేపర్‌మిల్ కార్మికులు, తెలుగుయువత నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కాశి నవీన్ మొక్క అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గన్ని కాకినాడ బయలుదేరి వెళ్లారు.

జన్మభూమి గ్రామసభల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - కోరుకొండ


ఈ నెల 2వ తేదీ నుంచి జరిగే జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి షెడ్యూల్‌ను ఎంపిడిఒ మహేశ్వరరావు తెలిపారు. మండలంలో తహశీల్దార్ ఒక బృందంగాను, మండల అభివృద్ధి అధికారి ఒక బృందంగాను ఉంటూ రోజుకు నాలుగు గ్రామాల చొప్పున ఐదు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. 2న ఉదయం కోటికేశవరం కనుపూరు, మధ్యాహ్నం బొల్లెద్దుపాలెం, గాదరాడ, 3న ఉదయం దోసకాయలపల్లి, నరసాపురం, మధ్యాహ్నం నిడిగట్ల, జంభూపట్నం, 5న ఉదయం కాపవరం, జగన్నాధపురం, మధ్యాహ్నం మునగాల, బుచ్చింపేట, 6న ఉదయం శ్రీరంగపట్నం, గాడాల, మధ్యాహ్నం కోటి, బూరుగుపూడి, 8న ఉదయం కోరుకొండ, పశ్చిమగానుగూడెం, మధ్యాహ్నం మధురపూడి, రాఘవపురంలలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు

తాగునీరు కలుషితం.. పట్టని అధికారులు..

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

మండలంలోని మంచినీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ట్యాంకులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో


శిథిలావస్థలో ఉప్పాడ ట్యాంక్

ప్రజలకు అందిస్తున్న తాగునీరు కలుషితం అవుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నాగులాపల్లి రక్షత మంచినీటి పథకం ద్వారా మండలంలో సుమారు 38 ఓహెచ్ఎస్ఆర్ సుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నా పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాద్, ఇసుకపల్లి, మూలపేట, తదితర గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ట్యాంక్ పెచ్చులూడడంతో సుద్ధి చేసిన తాగునీరు కలుషితం అవుతోంది. రూ.10 కోట్లతో 2002లో గ్రామీణ రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సుద్ధి చేసిన తాగునీరు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అందిస్తున్నా పంచాయతీ వారు నిర్వహణ లోపంతో కలుషితమైన త్రాగునీరు గ్రామాలకు అందివ్వడంతో రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. స్వచ్ఛభారత్ అంటూ అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నా వాటర్ ట్యాంకులు చుట్టూ ఉన్న తుప్పలను తొలగించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి ఓహెచ్ఎస్ఆర్‌లు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు


అమీనాబాద్‌లో తుప్పల్లో వాటర్ ట్యాంక్

చేరుకోవడంతో ఇరువైపులా నివాసముంటున్న గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతి ఏడాదీ గ్రామీణ రక్షత మంచినీటికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పంచాయతీ నిర్వహణ లోపంతో గ్రామస్తులకు సుద్ధి చేసిన తాగునీరును అందించడంలో విఫలం కావడంతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి శిథిలావస్థకు చేరుకున్న ఓహెచ్ఎస్ఆర్‌ల మరమ్మతులు చేపట్టి ప్రతినెలా విధిగా ట్యాంకులను శుభ్రం చేయించాల్సిందిగా అధికారులను కోరుతున్నారు.

4న మత్స్యకారుల కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - కాకినాడ


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని జనవరి 4న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నామని ఎస్‌టి సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి చిట్టిబాబు, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం కాకినాడ ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల మానిఫెస్టోలో మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారని తెలిపారు. 1970లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేశారని, అయితే అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ దీన్ని అడ్డుకున్నారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో కూడా ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. వేట నిషేధ సమయంలో రెండు నెలల కాలానికి మత్స్యకారులందరికీ 100 కేజీల బియ్యం, రూ.10 వేలు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించే సర్వేల్లో మొత్తం 40 లక్షల మంది తమ జనాభా ఉండగా ప్రభుత్వం 20 లక్షలే అని చెప్పడంలో నిజం లేదన్నారు. ఈ సమావేశంలో మత్స్యకారసంఘ నేతలు మల్లాడి రాజేంద్రప్రసాద్, బడే గోవింద్, కర్రి నారాయణ, లింగస్వామి, కాలాడి జయనారాయణ, వరిపల్లి చినస్వామి, గరికన సత్యనారాయణ, శ్రీనివాస్, హనుమంతరావు, బొడ్డు సత్యనారాయణ, ధోని చిట్టిబాబు పాల్గొన్నారు.

డ్యాన్స్‌లో దీపికకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కాకినాడ


అవార్డులతో దీపిక

ఎంఎస్ఎన్ నాచోరే 2017 క్లాసికల్ డాన్స్ పోటీల్లో బాలాజీ స్కూల్ విద్యార్థి కె.దీపికకు ప్రథమ స్థానం లభించిందని డైరక్టర్ శ్రీనివాస చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అశోక్ నగర్ లోని స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీనివాస చౌదరి మాట్లాడారు. తమ స్కూల్ 6వ తరగతి విద్యార్థిని దీపిక ప్రథమ స్థానం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. స్కూల్ హెచ్ఎం కెవి భాస్కర్ మాట్లాడుతూ కాకినాడ జోన్ పరిధిలో 18 పాఠశాలలు పాల్గొనగా తమ విద్యార్థి ప్రథమ స్థానం సాధించినట్టు చెప్పారు.

బిసి జెఎసి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి- తాళ్లరేవు


ఘెరావ్ చేస్తున్న నాయకులు

బిసి హాస్టల్‌ను బిసి విద్యార్థుల కోసం మాత్రమే ఉపయోగించాలని డిమాండ్ చేస్తూ బిసి జెఎసి, తాళ్లరేవు మండల అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం బిసి హాస్టల్ వద్ద ధర్నా చేశారు. హాస్టల్ ప్రారంభానికి వచ్చిన ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును జెఎసి, అఖిలపక్ష నాయకులు ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, అఖిలపక్ష పార్టీ కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఎంఎల్ఎతో మాట్లాడారు. హాస్టల్‌ను తాళ్లరేవు సిహెచ్‌సికి బదలాయించడం తగదని చెప్పారు. భవనంలో ఎవరైనా రోగులు మృతి చెందితే మళ్లీ హాస్టల్ నిర్వహించినపుడు ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బిసి హాస్టల్‌ను తాళ్లరేవు తరలించడానికి ప్రతిపాదనలు పంపుతామని ఎంఎల్ఎ చెప్పారు. బిసి స్టడీ సర్కిల్, బిసి సామాజిక భవనంగా ఉపయోగించాలని జెఎసి నాయకులు ఎంఎలఎ దృష్టికి తీసుకొచ్చారు.

ఆదిత్యలో ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి-కాకినాడ



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీ నిర్వహించామని ప్రిన్సిపల్ కె.కరుణ తెలిపారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారని చెప్పారు. ప్రపంచంలో చాలా దేశాలు ఉగ్ర భూతానికి బలి అవుతున్నాయని తెలిపారు. ఉగ్రవాద సమూల నిర్మూలనకు ప్రపంచ దేశాలన్నీ ఏకదాటిపైకి వస్తే పూర్తిగా నిర్మూలించ వచ్చన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలల కో-ఆర్డినేటర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదం వల్ల చాలా మంది ప్రజలు మృతి చెందడమే కాక దేశ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం పడుతుందన్నారు. ప్రజా జీవన వ్యవస్థ అగమ్యగోచరంగా తయారై ప్రజలంతా భయంతో బతకాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం.సింహాద్రి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని ముందే పసిగట్టే నైపుణ్యం అందరిలో రావాలన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం, ప్రపంచాన్ని కాపాడదాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.నాగశ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఇ.సునీత పలువురు పాల్గొన్నారు.

సామర్లకోటలో ఘనంగా గ్రాండ్ క్రిస్మస్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సామర్లకోట కుమ్మరవీధిలో శనివారం రాత్రి గ్రాండ్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు మందపల్లి వెంకన్న, తాతపూడి కృష్ణబాబు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ గ్రాండ్ క్రిస్మస్‌లో మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎంఎల్‌సి బొడ్డు భాస్కరరామారావు, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, రైతు సంఘం నాయకులు కంటే జగదీష్‌మోహన్, ఎంపిపి గొడత మార్త పాల్గొన్నారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుమ్మళ్ల బుజ్జి, ఎం.దుర్గారావు, తాతపూడి యేసు, తాతపూడి లోవరాజు, సత్తిబాబు, చిన్న, చింతాడ దుర్గారావు, చింతాడ రామకృష్ణ, బోడ్డపాటి అప్పారావు పాల్గొన్నారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఎస్‌టియు టీచర్స్ యూనియన్ 2018 క్యాలెండర్‌ను ఎంపిపి టేకుమూడి అనంతలక్ష్మి, తాళ్లరేవు సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు ఒవి.రమణ, జి.మహేష్‌కుమార్, పి.రామకృష్ణ, ఎ.రామకృష్ణ, నాగభూషణం, రమణకుమార్, సిఎస్ఆర్‌కె మూర్తి, గుబ్బల శివశంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న శ్రీరాములు

బౌద్ధ ధమ్మ వ్యాప్తికి అంబేద్కర్ కృషి

ప్రజాశక్తి-తాళ్లరేవు

భారతదేశ వ్యాప్తంగా బౌద్ధ ధమ్మ వ్యాప్తికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషి చేశారని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తాల శ్రీరామలు అన్నారు. తాళ్లరేవు జల్లివారి పేటలో బౌద్ధ ప్రచారక్ సాధనాల వెంకట్రావు ఆధ్వర్యంలో బౌద్ధ ధమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభలో పలువురు ఉపాసకులు మాట్లాడారు. బౌద్ధం శాంతి, సౌభ్రాతృత్వం ప్రబోధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిరత్న బౌద్ధ సంఘం తాళ్లరేవు మండల అధ్యక్షులు దున్నా సత్యనారాయణ, కాశి జానకి రాముడు, పి.నరసింహమూర్తి, పంతగడ ఆనంద మోహన్, గుత్తాల అబ్బాయి, ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, ఎం.తణుకురాజు, జక్కల ప్రసాదబాబు పాల్గొన్నారు.

4 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-కాకినాడ

జనవరి 4వ తేదీ నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని సరస్వతీ గాన సభ నిర్వాహకులు తెలిపారు. 4వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సంగీత విద్యాలయం నిర్వాకురాలు పెద్దాడ సూర్య కుమారి శిష్య బృందం ఆధ్వర్యంలో గాత్ర కచేరి నిర్వహిస్తున్నామన్నారు. 5వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు పుష్పారామ్ మోహన్‌రావు శిష్యబృందం ఆధ్వర్యంలో పంచవీణ కచేరి, 6వ తేదీ సంగీత విద్వాంసుల ఆధ్వర్యంలో పంచరత్న సేవ బృందగానం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నేతగా సాయి

ప్రజాశక్తి-కాకినాడ

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షునిగా పెద్దాపురం శాఖా గ్రంథాలయం ప్రథమ శ్రేణి లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు కోన దేవదాసు ఉత్తర్వులు విడుదల చేశారు. ఉపాధ్యక్షునిగా నియమితులైన సాయిని జిల్లా చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, జివిఆర్ ఎన్‌హెచ్‌కె వర్మ, ములంపాక శ్రీనివాసరావు, డి.రాజు, గట్టి రామారావు, బి.నాగేంద్రకుమార్, జివివి.త్రినాథ్, తలాటం సూర్యారావు, కె.కిషోర్, కె.రమేష్ బాబు, డి.రవికుమార్ అభినందించారు.

2 నుంచి క్రీడా జన్మభూమి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో జనవరి 2 నుంచి 18వ తేదీ వరకూ క్రీడా జన్మభూమి నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ తెలిపారు. పంచాయతీ స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా 2న వాలీబాల్, 3న కబడ్డీ, 4న కోకో, 5న 50, 100 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తామని చెప్పారు. సంప్రదాయ క్రీడలైన తొక్కుడుబిళ్ల, స్టెప్పింగ్, త్రోబాల్, బాలురకు కోతి కొమ్మచ్చి, గోలీలాట నిర్వహిస్తామని తెలిపారు. 6న మండల స్థాయిలో కబడ్డీ, 7న 5కె రన్, 8న కోకో, 9న వాలీబాల్, 10న అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. 7న రాజమహేంద్రవరంలో ఉదయం 8 గంటల నుంచి 2 వేల మందితో జన్మభూమి 5కె రన్ నిర్వహిస్తారని చెప్పారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్, డిఇఒ, సిపిఒ, డిపిఒ తదితర శాఖాధికారుల సహకారంతో క్రీడా పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోటీల్లో ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై చర్యలకు వినతి

ప్రజాశక్తి-సామర్లకోట

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు టౌన్ ఎస్ఐ ఎల్.శ్రీనివాస నాయక్‌కు శనివారం రాత్రి వినతిపత్రం ఇచ్చారు. మద్యం తాగి వాహనాల్లో ప్రయాణం చేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎస్.యువరాజ్, కె.తులసీదాస్, పి.గోపాల్, డి.శ్రీను, బి.శ్రీను, డి.బాలాజీ, కె.బాలాజీ, సిహెచ్.సతీష్ పాల్గొన్నట్టు చెప్పారు.

3న సాయి దత్తాత్రేయస్వామి జయంతి

ప్రజాశక్తి - సామర్లకోట

3న సామర్లకోట రైల్వేస్టేషన్ సమీపంలో దత్తాత్రేయ సమేత షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద దత్త జయంతి నిర్వహించనున్నట్టు ఆంధ్రా సాయిగీతా సమాజం అధ్యక్షులు డి.అప్పారావు తెలిపారు. దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

20 నుంచి విద్యుత్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

జనవరి 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ కలెక్టరేట్స్‌లో రిలే నిరాహర దీక్షలు చేపట్టనున్నట్టు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా కో-ఆర్డినేటరు వీసం వీరనాగు తెలిపారు. జనవరి 27న నిరవధిక సమ్మెలోనికి వెళ్ళడానికి ముందు 28 నుంచి నిరసనలు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలో చాలీ చాలని జీతాలతో అతి ప్రమాదకరమైన పని ప్రదేశాల్లో చార్మికులు పని చేస్తున్నారని ఆయన చెప్పారు. ప్రమాదాలకు గురై పలువురు అవయవాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

2 నుంచి జన్మభూమి ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలోని 28 వార్డుల్లో ఈ నెల 2వ తేదీ నుంచి జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బిఆర్.శేషాద్రి తెలిపారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించి రెండు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. డిఇఇ ఆర్.రమేష్ బాబు ఆధ్వర్యంలో ఎఇ కె.లోవరాజు, పిపిఎస్ బి.రాణీసంయుక్త, మేనేజర్ ఎంఆర్‌విఆర్ ప్రసాద్, వి.మహేష్, సిహెచ్.నూకరాజు, సయ్యాద్ అహ్మాద్ అలీషా, కె.రవి, పి.ఇమతార్, శ్రీదేవి ఒక బృందంగా ఉంటారని చెప్పారు. డిపిఇ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆర్‌ఒ ఒవి.సూర్యారావు, ఎఇ పివి.సుధాకర్, ఎం.నాగేశ్వరావు, వైవిఎం.రంగా, పి.శ్రీనివాస్, ఎన్.మహాలక్ష్మి, పి.శ్రీనివాస్, పిఎంకె రాజు, ఎ.అపర్ణ మరో బృందంగా ఉంటారని తెలిపారు. అర్హులందరూ ఈ గ్రామసభల ద్వారా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తొండంగి జన్మభూమి షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-తొండంగి

5వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం షెడ్యూల్‌ను తొండంగి మండల పరిషత్ కార్యాలయం ఆదివారం విడుదల చేసింది. 2వ తేదీన వేమవరం నుంచి జన్మభూమి లాంఛనంగా ప్రారంభమవుతుందని తెలిపారు. 3న ఎ.కొత్తపల్లి, గొల్ల ముసలయ్యపేట, కొమ్మనపల్లి, 4న దాన వాయిపేట, కృష్ణాపురం, ఎవి నగరం, పెరుమాళ్లపురం, 5న ఇ.చిన్నయ్యపాలెం, రావికంపాడు, బెండపూడి, గోపాలపట్నం, 8న పైడికొండ, యర్రయ్యపేట, తొండంగి, కోదాడ, 9న సీతా రామపురం, టి.అగ్రహారం, 11న శృంగవృక్షంతో జన్మభూమి కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

కొత్త సంవత్సర వేడుకల్లో యువత

ప్రజాశక్తి-గండేపల్లి

2017 సంవత్సరం చివరి రోజు సందర్భంగా యువతీ, యువకుల్లో ఉత్సాహాన్ని నెలకొంది. దానిలో భాగంగా మండలంలో యువకులు, యువతులు ఆయా గ్రామాల వద్ద ముగ్గులు వేసి ఆనందోత్సవాల్లో మునిగి తేలుతున్నారు. యువకులు బైకులపై సందడి చేశారు. రాత్రి సమయాల్లో బైకులపై తిరగడం వల్ల ఏ సమయంలో ఏమి జరుగుతుందో నని యువకుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నేడు ప్రజావాణి రద్దు

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే మీ కోసం ప్రజావాణిని రద్దు చేశామని కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. జనవరి 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ జన్మభూమి, మా ఊరు కార్యక్రమం ఏర్పాట్లలో అధికారులు ఉండటం వల్ల ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు పలు సంస్థలు సర్వం సిద్ధం చేశాయి. ప్రముఖ హోటల్స్‌లో ప్రత్యేక ఆహార పదార్థాలను ఏర్పాటు చేస్తున్నారు. వివిధ బేకరీల్లో కొత్త ఏడాదిని పురస్కరించుకుని సరికొత్త కేకులను తయారు చేశారు. కొత్త ఏడాది సందర్భంగా పలువ స్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. రూ.10 ఉండే యాపిల్ రూ.30కు, కమలా పళ్లురూ.20కు అమ్ముతున్నారు. నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌పి విశాల్‌గున్నీ నేతృత్వంలో పలు సూచనలు జారీ చేశారు.

పేదలందరికీ ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి-పెద్దాపురం

ఇళ్లు లేని పేదలందరికీ గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్టు ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. కోనసీమకు చెందిన తనను ఈ నియోజకవర్గ ప్రజలు ఎంతో అభిమానంతో తనను గెలిపించినందుకు కృతజ్ఞతగా ఈ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారను. ఇప్పటికే అనేక గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు పూర్తయ్యాయన్నారు. అన్ని గ్రామాల్లోను ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తవుతాయన్నారు. ఇళ్ళ పథకంలో మొదటివిడత నిర్మాణాలు పూర్తయ్యాయని, ఫిబ్రవరి నెలలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేస్తారని చెప్పారు.

ఎనీ టైమ్ మూతే..!

తప్పని నగదు ఇబ్బందులు.. పట్టని బ్యాంకర్లు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ఎటిఎంలు ఎప్పుడు చూసినా మూత వేసే ఉంటున్నాయి. నగదు ఇబ్బందులతో వచ్చే ప్రయాణికులు ఎటిఎంలను చూసి ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. బ్యాంకర్లు పట్టించుకుని ఎటిఎంలు సక్రమంగా పని చేసేలా చూడాలని జనం కోరుకుంటున్నారు. మండలంలో ఎటిఎంలు సక్రమంగా పనిచేయకపోవడంతో ఖాతాదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు సంవత్సరం కాలంగా ఎటిఎం సెంటర్లు పనితీరు అధ్వానంగా మారింది. దీంతో ఖాతాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి బ్యాంకుకూ సంబంధించి మండలంలో అధికారులు ఎటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే అవి సరిగ్గా పనిచేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో ఉత్తరకంచిలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం ఈ మధ్యకాలంలో ఎప్పుడూ పని చేయడం లేదు. 10 రోజుల నుంచి ఎటిఎంలు మూసివేశారు. ఈ ఎటిఎం సుమారు 30 గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేశారు. కానీ ఎటిఎం పనిచేయక పోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఎటిఎంలు పనిచేయక పోవడంతో వారు ఇతర బ్యాంకుల ఎటిఎం సెంటర్లపై ఆధారపడుతున్నారు. ఇతర బ్యాంకుల ఎటిఎంలో నగదును మూడుసార్లకు మించి విత్‌డ్రా చేస్తే సదరు బ్యాంకు ఛార్జీ చెల్లించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. తమ ఖాతాలో నగదు తక్కువగా ఉంటే జరిమానా విధిస్తున్న బ్యాంకులు వారు ఎటిఎం సెంటర్లు నగదు నిల్వలను సక్రమంగా నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఎటిఎం కేంద్రాలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉత్తరకంచిలో ఎటిఎం మూత

ఎటిఎంలు అలంకారప్రాయంగా ఉన్నాయి

తోటకూర బాబ్జి, ప్రత్తిపాడు



ఎటిఎంలు ఎప్పుడూ అలంకర ప్రాయంగా కనిపిస్తున్నాయి. డబ్బులు తీసుకోవడానికి ఉపయోగపడే ఎటిఎంలు నిరుపయోగంగా మారాయి. ఎటిఎంపై ఆధారపడిన మేము దాచుకున్న డబ్బులు తీసుకోవడానికి అర్హులం కాదా. ఎటిఎం సెంటర్‌లో అధికారులు కనీసం 10 రోజులకు ఒకసారైనా డబ్బులు నిల్వ ఉంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.

పెద్ద నోట్ల రద్దుతో సామాన్యుల అవస్థలు

దలే చిట్టిబాబు, పెదశంకర్లపూడి



కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేయడంతో సామాన్యులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు డబ్బులు ఇవ్వడానికి పది రోజుల నుంచి ఎటిఎం పనిచేయకపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాము. పెద్దనోట్లు రద్దుచేసి బ్యాంకుల్లో డబ్బు లేకుండా చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కింది.

ఘనంగా శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పెద్దాపురం




కేకు కోస్తున్న శ్రీనివాస్


జనసేన సేవాదళ్ జిల్లా ఇన్‌ఛార్జి ఏడిద శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పులిమేరులోని శాంతివర్ధన మానసిక వికలాంగుల పాఠశాలలో శ్రీనివాస్ కేక్ కట్ చేసి ఈ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి మాట్లాడారు. వికలాంగ బాలలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం శ్రీనివాస్ వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. తుమ్మల రామస్వామి పాఠశాల నిర్వాహకులు వీరబాబుకు నగదు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుశ్రీ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ, కాకినాడ జనసేన నాయకులు కడలి ఈశ్వరి, విజయగోపాల్, చింతపల్లి బన్ని, నాగు, కత్తిపూడి బాబి, కెసి వాసు, నున్న గణేష్, నాయుడు, చిన్న, మాజీ సర్పంచ్ తుమ్మల సూర్యకృష్ణమూర్తి, డిఎస్ ప్రసాద్, లక్ష్మణ్‌దివాకర్, పోతుల మణికంఠ, నరేంద్ర, నెల్లిపూడి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

2018కు అంకెలతో స్వాగతం

ప్రజాశక్తి - గండేపల్లి

వివిధ ప్రత్యేక సందర్భాల్లో గణిత చదరాల ద్వారా శుభాకాంక్షలు తెలిపే బాల గణితావధాని ఆదిత్య కళాశాల విద్యార్థి తోటకూర సాయివంశీ నూతన సంవత్సరం సందర్భంగా చిన్న అంకెల ద్వారా శుభాకాంక్షలు తెలిపాడు. దిగువ నీయబడ్డ చదరాల్లో ఒక సంఖ్యను సర్కిల్ చేసి ఎంచుకోవాలి. ఆ సంఖ్య నుండి అడ్డువరుస, నిలువ వరుసల్లో ఎంచుకున్న నాలుగు సంఖ్యలు మొత్తం చూస్తే 2018 వస్తుంది. ఇలా ఏవిధంగా చూసినా 2018 రావడమే విశేషం.





వంశీ

పేదలందరికీ రిజర్వేషన్లు

ప్రజాశక్తి - పెద్దాపురం



సమాజంలోని అన్ని కులాల్లో ఉన్న పేదలందరికీ రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ న్యాయపోరాట సమితి జిల్లా అధ్యక్షులు బొడ్డు కామరాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అన్ని కులాల్లో పేదల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. కులాలు, ఉపకులాలు, అట్టడుగు కులాల్లో ఆర్థిక అసమానతలు, కుల వివక్ష నేటికీ కొనసాగుతోందని చెప్పారు. అన్ని కులాల్లో ఉన్న పేదలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా కులవివక్షను రూపు మాపే అవకాశం ఉందన్నారు. విద్య, ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, రాజకీయం, ఉద్యోగాలు అన్నింటిలోను రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కుల, మత, ప్రాంతీయ తత్వాలకు తావులేని భారత రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించేందుకు పేదలందరికీ ఈ రిజర్వేషన్లు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అందుకోసం తమ సంస్థ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. **ఫొటో: 31 పిడిపి 110: వడ్డి కామరాజు**

కమ్యూనిటీ భవనానికి రూ.10 లక్షల నిధులు

ప్రజాశక్తి - పెద్దాపురం



సభలో ప్రసంగిస్తున్న మంత్రి చినరాజప్ప

పట్టణంలో సూర్యబలిజ కమ్యూనిటీ భవన నిర్మాణానికి తాను గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 లక్షలు అందించనున్నట్లు ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం స్థానిక దర్గాపేట సెంటర్‌లో సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ కొరిపూరి రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తాను గతంలో ఈ కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చానని, ఇప్పటి వరకూ స్థలం దొరకనందున ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదని చెప్పారు. ప్రస్తుతం స్థల సేకరణ జరిగినందున ఈ నిధులు మంజూరు చేశానని త్వరితగతిన ఈ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని సూచించారు. సూర్యబలిజల ఆర్థికాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ కమ్యూనిటీ భవనానికి సంబంధించి స్థలం దొరకలేదన్నారు. గతంలో సూర్యబలిజ పేదలను ఆదుకున్న ఎఎంజి సంస్థ అధినేత జాన్ డేవిడ్ సంస్థకు సంబంధించి స్థలం ఇక్కడ ఉందని, ఈ స్థలాన్ని కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఇచ్చేందుకు ఆయన కుమారులు అంగీకరించారని తెలిపారు. ఈ సభలో రామ్మోహనరావు, ధరణికోట యోహన్, ధరణికోట సత్తిబాబు, మాంతరపు సూరిబాబు, సాలూరి వెంకటేశ్వరావు, కోటిపల్లి నారీమణి, ధరణికోట పెద్దరాజు, మద్దుల వీరబాబు, టిడిపి అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాల తాళ్ల ఉత్సవం

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం- జగ్గంపేట రహదారిలోని సత్తెమ్మ అమ్మవారి జాతరకు సంబంధించి ఆదివారం ఉయ్యాల తాళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసే అమ్మవారి ఊయ్యాల ఏర్పాటుకు సంబంధించి ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. తాడిచెట్లను ఎద్దులబండిపై ఊరేగిస్తూ డప్పుల వాయిద్యాల మధ్య వీటిని పురవీధుల్లో ప్రదర్శించారు. అమ్మవారి జాతరకు సంబంధించి ప్రత్యేక సాంప్రదాయ పద్ధతుల ప్రకారం జమ్ము, జోడు వాయిద్యాలు, తంబల కళాకారులతో ఈ ఊయాల తాళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. పెద్దాపురం మున్సిపల్ సెంటర్ నుండి మెయిన్‌రోడ్డు మీదుగా ఆంజనేయస్వామి గుడి సెంటర్, డైలీ మార్కెట్ సెంటర్, దర్గాసెంటర్, కొత్తపేట సెంటర్ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అనంతరం తాడిచెట్లతో అమ్మవారి ఆలయం ఎదురుగా ఉయ్యాల ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి పప్పల నాగరాజు, ఏడిద మాణిక్యాలరావు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.



కళాకారుల వాయిద్యాలు



దండలు తయారు చేస్తున్న వ్యాపారులు

జోరుగా పూల వ్యాపారం

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోటలోని స్థానిక స్టేషన్ సెంటర్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి పుష్పగుచ్చాలు, పూలదండలు తయారు చేయడంలో అమ్మకందారులు నిమగ్నం అయ్యారు. పుష్ప గుచ్చాలు రకాలను బట్టి రూ.30 నుంచి రూ.200 వరకూ విక్రయిస్తున్నట్టు చెప్పారు. పూల దండలు రూ.150 నుంచి రూ.200 వరకూ విక్రయిస్తున్నట్టు తెలిపారు.

రబీకి పుష్కర నీరు ప్రశ్నార్థకమే...

ప్రజాశక్తి - సీతానగరం

పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా రబీలో మెట్టకు నీటి విడుదలకు అవకాశమే లేదు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పూర్తి అవ్వాలన్నా, పోలవరం ఎడమ కాలువలో కాంక్రీట్ పనులు చేపట్టాలన్నా, లిఫ్టింగ్ నిలిపివేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఒక ఏడాది రబీలో తొర్రిగడ్డ ఎత్తిపోతల ద్వారా మొక్కజొన్న పంటకు నీరివ్వని విషయం తెలిసిందే. ఇప్పుడు మెట్టకు పుష్కర 1,2 పథకాల ద్వారా నీరిచ్చే ప్రసక్తే లేదని యంత్రాంగం పేర్కొంది. కొత్తగా చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే ప్రస్తుతం పోలవరం,


పుష్కర ఎత్తిపోతల పథకం కార్యాలయం

పుష్కర పథకాల కాల్వల్లో చుక్క నీరు ఉండకూడదు. ఉన్న నీటినే ఎక్కడికక్కడే తోడివేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పురుషోత్తపట్నం ఎత్తిపోతల నిర్మాణ కాలపరిమితి గత అక్టోబర్ 29వ తేదీకే ముగిసింది. తిరిగి మార్చి 31 2018కి కాలపరిమితిని పొడిగించారు. అందుకు ప్రణాళికాబద్ధంగా గడువుకు ముందే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించే దిశగా రాత్రింబవళ్లు పనులు చేయిస్తున్నామన్నారు.

ఎత్తిపోతల పథకాలు ఏవైనా ఖరీఫ్‌లో ఒక పంటకు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ సమయంలో వర్షాలు ఎక్కువగా ఉండటం, గోదావరికి వరదలు ఉండటంతో ఎత్తిపోతల పథకాల కిందకు నీరు అందుతుంది. అనంతరం నీటి నిల్వలు లేకపోవడంతో ఎత్తిపోతల పథకాలు పనికిరాకుండా ఉంటున్నారు. ప్రతి ఏడూ నదిలో డ్రెడ్జింగ్ పనులు జరక్కపోవడంతో ఇసుకమేటలు వేస్తున్నాయి. ఫలితంగా నీరు నిల్వలు ఉండట్లేదు. దీనికి తోడు ఎత్తిపోతల పథకాల నిర్వహణ కూడా సరిగా లేకపోవడంతో ఇవి అక్కరకు రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం గోదావరిలో నీటి నిల్వలు అడుగంటడంతో రబీకి నీరు అందట్లేదు. .

అంగులూరు క్వారీకొండ వరకు వచ్చిన నది అక్కడి నుంచి రెండు పాయలుగా విడిపోయింది. ఎక్కువ


గోదావరిలో అడుగంటిన జలాలు

భాగం పశ్చిమకు పోగా, మిగిలినది తూర్పు వైపున పారుతోంది. తొర్రిగడ్డ ఎత్తిపోతలు ఆ ప్రదేశంలోనే నిర్మించడంతో నదిలో నీటిమట్టం ఎప్పుడూ 14 మీటర్లకు తగ్గక నిరాటకంగా నీరు అందుతుందని అధికారులు తెలిపారు. ఉన్న పథకాలన్నింటిలో అక్కడే ఎక్కువ లోతు ఉందన్నారు. ప్రస్తుతం పుష్కర వద్ద 13.4 మీటర్ల నీటిమట్టం ఉందన్నారు.

పుష్కర పథకం కింద 92 కిలోమీటర్ల పొడవున లక్షా 85వేల ఎకరాల ఆయకట్టుకు నిర్దేశించగా, ఇప్పటివరకు లక్షా 55వేల ఎకరాల వరకే నీరు అందించగలుగుతున్నామని పుష్కర పథకం డిఇ ఆర్.వెంకట్రావు తెలిపారు. తుని పరిసర ప్రాంతాల్లో భూసేకరణ సమస్య తలెత్తిందన్నారు. జనవరి నుంచి మే వరకు 8 పంపుసెట్లను ఓవరాయిలింగ్ చేసి మరమ్మతులు పూర్తి చేసి జూలైకు మెట్టకు నీరు విడుదల చేసే పనిలో ఉన్నామని ఆయన వివరించారు.

త్రినాథరావుపై బైండోవర్ తగదు

ప్రజాశక్తి -రంపచోడవరం రూరల్

గిరిజనుల హక్కుల కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్న న్యాయవాది త్రినాథరావుపై బైండోవర్ కేసు పెట్టడం అన్యాయమని పిసిసి జాయింట్ సెక్రటరీ చుక్కా సంతోష్ కుమార్, లేబర్ సెల్ చైర్మన్ వడ్డాది వెంకటేశ్వరరావు అన్నారు. విశాఖ జిల్లా, జి.మాడుగుల మండలం వాకపల్లిలో గిరిజన మహిళలపై గతంలో గ్రేహౌండ్స్ దళాలు అగాయిత్యాలకు పాల్పడిన కేసు కోర్టులో ఉందని తెలిపారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది పల్లాల త్రినాథరావుని స్పెషల్ ఎపిపిగా వేయాలని వాకపల్లి మహిళలు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. దీనికి సంబంధించిన పనుల నిమత్తం ఆయన విశాఖ వెళ్లారని చెప్పారు. అక్కడ పోలీసులు త్రినాథరావును అడ్డగించి మాడుగుల పోలీస్ స్టేషన్‌కి తరలించారన్నారు. అంతేకాకుండా ఆయనపై అన్యాయంగా బైండవర్ కేసు బనాయించారని తెలిపారు. ఇది దారుణమన్నారు. దీనికి కారణమైన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

300 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం రూరల్

స్థానిక సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ వద్ద ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని స్వామి కపాలనంద తెలిపారు. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్యులు వైద్యసేవలందిం చారన్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించామని తెలిపారు. శిబిరానికి హాజరైన వారందరికీ భోజన ఏర్పాట్లు కూడా చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి వీధిన పడిన సమదాల గంగమ్మ కుటుంబానికి గిరిజన సంఘం నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. రూ.1,200 నగదును అందించారు. మరింత సాయం అందించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కోసూరి అప్పలరాజు, పాండ్ల సూరిబాబు, ఆవూరి చల్లారావు, కోసూరి బాలరాజు, పాండ్ల సూరిబాబు, ఆవూరి ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ సభలో పాల్గొన్న అధికారులు

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ తూతూ మంత్రంగా సాగుతోంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.రమేష్ ఆధ్వర్యంలో ఎపిఒ బ్రమరాంబ, సిబ్బంది సామాజిక తనిఖీలను నిర్వహించారు. అడిషనల్ పీడీ శ్యామల, డిఎల్ఎస్ శర్మ పాల్గొన్నారు. ఆయా గ్రామాల వారీగా జరిగిన పనులపై రికార్డులను పరిశీలించారు. గ్రావెల్ రోడ్లు, కూలీల విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ వంటివి తనిఖీ చేశారు. కొన్ని పనులకు కూలి చెల్లించకపోవడాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో పీడీ ప్రసాద్, ఎస్ఆర్‌పి కెవి.రమణ, ఆయా గ్రామాల సర్పంచులు ఇసి, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జన్మభూమి దృష్టికి ప్రజాసమస్యలు

ప్రజాశక్తి - విఆర్ పురం

గ్రామాల్లో ప్రజలు నానా సమస్యలతో సతమతమవుతున్నారని, 2 నుంచి జరిగే జన్మభూమి-మా ఊరు గ్రామసభల్లో సమస్యలను ఎలుగెత్తిచాటాలని సిపిఎం మండల కార్యాదర్శి బొప్పిన కిరణ్ పిలుపు నిచ్చారు. ఆదివారం రేఖపల్లిలోని బొప్పిన భీమయ్య భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం హడావుడి చేసి రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న జన్మభూమిలో పారదర్శకత కొరవడిందన్నారు. 4వ విడత జన్మభూమిలో జనం నుంచి తీసుకున్న అర్జీలు ఏమేరకు పరిష్కారమయ్యాయో అధికారులు ప్రజలు వివరించాలన్నారు. గిరిజనుల ఆధీనంలో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు మొదటి విడత జన్మభూమి నుంచి అర్జీలు పెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇలా పలు సమస్యలపై ప్రజలు పెట్టుకున్న అర్జీలన్నీ నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇలాంటి సమస్యలను జన్మభూమి సభల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడిని తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - కూనవరం

ప్రస్తుతం భావ ప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను పాత్రికేయులు ప్రజాస్వామ్య వాదులు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 2017 వీడ్కోలు సందర్భంగా పాత్రికేయులతో సిపిఎం మండల కమిటీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది ఈ సందర్భంగా యర్రంశెట్టి మాట్లాడారు. ప్రజా సమాస్యలు వెలికితీయడంలో మీడియాది కీలకపాత్ర అన్నారు. ప్రశ్నించే ప్రజలపై, మీడియాపై దాడులు జరుగుతున్నాయన్నారు విధినిర్వహణలో ఉన్న ఎందరో మీడియా ప్రతినిధులు ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు, మతోన్మాద దుండగుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. గౌరిలంకేష్, చరిత్రకారులు కల్బుర్గి పన్సారే వంటి వారు హత్యకు గురయ్యారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక మాఫియా, భూకబ్జాదారులు దాడులకు తెగబడ్డారన్నారు తెలంగాణలో గతంలో ఎబిఎన్ఐ, ప్రస్తుతం నవ తెలంగాణపై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం సాగిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంపై,


సమావేశంలో మాట్లాడుతున్న యర్రంశెట్టి

ప్రజాహక్కులపై దాడిచేస్తే ప్రజలు ఊరుకోరన్నారు. ప్రజల చేతుల్లో చివరకు వారు ఓడిపోక తప్పదన్నారు. దాడులపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, టి.నాగరాజు, ఆవుల మురళి, పాయం సీతారామయ్య, కె.శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, పొడియం రామారావు, నానుపల్లి వెంకటేశ్వరరావు, పాయం సత్యనారాయణ, శ్యామల కృష్ణ, కుంజా రాధ పాత్రికేయులు పాల్గొన్నారు.

లవకుశ అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

చిన్నతనంలోనే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చూపిన గిరిజన విద్యార్థి గుమ్మిడి లవకుశను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరక్టర్ సరస్వతి అన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా రంపచోడవరం పిఎంఆర్‌సిలో శనివారం గణిత ఉపాధ్యాయ బృందం నిర్వహించిన కార్యక్రమంలో లవకుశను అభినందించారు. డిడి ప్రత్యేకంగా అభినందించారు. గతనెలలో చెన్నయ్‌లో జరిగిన జాతీయ చెస్‌పోటీల్లో లవకుశ ట్రోఫీని కైవశం చేసుకున్న సంగతి విదితమే. లవకుశకు తర్ఫీదునిచ్చిన కోచ్ రామ్‌కుమార్‌ను, ప్రోత్సాహించిన పాఠశాల హెచ్ఎం తడబాల నాగేశ్వరావును డిడి అభినందించారు. ట్రోఫీతో పాటు ప్రశంసపత్రాన్ని లవకుశకు డిడి అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానటరింగ్ బిఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం సంతోషాలను నింపాలి

ప్రజాశక్తి - విఆర్ పురం

కొత్త సంవత్సరం అందరి కుటుంబాల్లో సంతోషాలను నింపాలని ఎంపిపి కారం శిరమయ్య ఆకాంక్షించారు. ఆదివారం రేఖపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ,దుఃఖాలు సర్వసాధారణమన్నారు. అనుభవాల నుంచి కొత్త విషయాలను నేర్చుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సంధర్భంగా మండల ప్రజలకు, అదికారులకు, సహచర ప్రజా ప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైస్ ఎంపిపి చిక్కాల వీరమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల కుసుమాంబ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ముత్యాల రామారావు, సిపిఎం మండల కార్యాదర్శి బొప్పిన కిరణ్, టిడిపి మండల అధ్యక్షులు జంగాల మల్లికార్జునరావు, వైసిపి మండల కన్వీనర్ పొడియం గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిట్టా రామారావు తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కూనవరం : నూతన సంవత్సరం సందర్భంగా సిపిఎం నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి శ్రీనువాసురావు, మేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు గడువుపెంపు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి ఇంటర్ పరీక్షలు రాసేవారికి ఈనెల 11 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా గడువు పెంచినట్లు ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ గొడారపు కృష్ణ తెలిపారు. 12 నుంచి 28 వరకు అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9441475145కు నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

10న సిఎం పర్యటన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జనవరి 10న ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో పర్యటించనున్నారు. ముమ్మిడివరం మండలం సిహెచ్ గున్నేపల్లిలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కార్తికేయమిశ్రా సిహెచ్ గున్నేపల్లి గ్రామంలో సిఎం పర్యటనా ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ సిహెచ్‌గున్నేపల్లిలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతున్న దృష్ట్యా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలం నుంచి వేలాది ప్రజలు తరలి వస్తారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రేషన్‌కార్డులు, రుణాలు, చంద్రన్నబీమా తదితర వాటిని పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ గొలకోటి శివరామకృష్ణ, జెసి-2 ఎ.రాధాకృష్ణమూర్తి, ఆర్‌డిఒ బి.వెంకటరమణ, మున్సిపల్ ఛైర్మన్ చెల్లి శాంతిఅశోక్, ఒఎన్‌జిసి గ్రూపు జనరల్ మేనేజర్ పాండే, రాజమహేంద్రవరం ఒఎన్‌జిసి చీఫ్ ఇంజినీర్ సిహెచ్.కైలాసపతి, సర్పంచ్ దంగేటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌లోకి ఈస్ట్ జోన్ డిఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం క్రైం

రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఈస్ట్‌జోన్ డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబును విఆర్‌లో పెట్టారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా ఎస్‌బి డిఎస్‌పిగా పనిచేస్తున్న నాగరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో నాగరాజు ఇక్కడ ఛార్జి తీసుకోనున్నారు. ఈస్ట్‌జోన్ డిఎస్‌పిపై పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో విఆర్‌లో పెట్టినట్టు సమచారం.



సమకాలీన పరిస్థితులపై అధ్యయనం అవసరం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కాకినాడ

ఉపాధ్యాయులు సమకాలీన పరిస్థితులను అధ్యయనం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కెఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్టడీ సర్కిల్‌ను నర్విహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్‌కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విద్యారంగంలో నీతి అయోగ్ సిఫార్సులు, ఎఫ్ఆర్‌డిఐ బిల్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 20 కేంద్రాలలో ఉపాధ్యాయులకు స్టడీ సర్కిల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్లు జోగా అప్పారావు, ఎం.విజయగౌరి, టివిజిజి ఆర్ఆర్ చక్రవర్తి, పెంకే వెంకటేశ్వరరావు, యంఆర్‌సి మోహన్, ఎ షరీఫ్, టిజి వాషింగ్టన్, ఎస్‌వివి.చలపతి, జివి.రమణ, కెవివి.నాగేశ్వరరావు, ఎంవి సాయిరామ్, ఎస్.వీరబాబు, ఎస్ సరోజిని దేవి, సిహెచ్‌వి రమణ, యుటిఎప్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బేతినీడి శ్రీనివాసరావు, ఎన్ ఆరుణకుమారి, జె.సత్యనారాయణ, జె.రూపస్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో పచ్చపాతం

జన్మభూమి కమిటీలదే పెత్తనం
టిడిపి నాయకుల సిఫార్సులు ఉంటేనే లబ్ధి
నాలుగు విడతల జన్మభూమిలోనూ ఇదే తీరు...

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రభుత్వ పథకాల అమల్లో పచ్చపాతం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వీటి అమల్లో జన్మభూమి కమిటీలే పెత్తనం సాగిస్తున్నారు. టిడిపి నాయకులు, జన్మభూమి కమిటీ సిఫార్సులు ఉన్నవారికే ఈ పథకాలు అందుతున్నాయి. దీంతో నిజమైన లబ్ధిదారులు పథకాలకు దూరమవుతున్నారు. జన్మభూమి జరిగిన నాలుగు విడతల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 5వ విడత జన్మభూమిలోనైనా న్యాయం జరుగుతుందోనని వారు ఎదురు చూస్తున్నారు.

అర్హతలున్నా అందని పింఛన్లు


గత జన్మభూమిలో నియోజకవర్గంలో ప్రత్తిపాడు మండలంలో 1000 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 500 మందికి మాత్రమే పింఛన్లు వచ్చాయి. ఏలేశ్వరం మండలంలో 748 మంది దరఖాస్తు చేసుకోగా 442 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. శంఖవరం మండలంలో 613 మందికి 320 మందికి మాత్రమే పింఛన్లు వచ్చాయి. రౌతులపూడి మండలంలో 1,256 మంది దరఖాస్తు చేసుకోగా 436 మందికి పింఛన్లు అందాయి. టిడిపి నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారకే ఇవి అందాయని పలువురు విమర్శిస్తున్నారు.

రేషన్‌కార్డులు అందక ఇక్కట్లు

నియోజకవర్గంలో ప్రత్తిపాడులో గత జన్మభూమిలో రేషన్ కార్డు కోసం 1,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,200 మందికి కార్డులు అందించామని అధికారులు తెలిపారు. ఏలేశ్వరం మండలంలో 619 మందికి 600, శంఖవరం మండలంలో 1,030కి 972 మందికి రేషన్‌కార్డులు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. కొత్తగా నమోదైన రేషన్‌కార్డుల ఎంపిక పూర్తి వివరాలు అందలేదని అధికారులు తెలిపారు.

ఇళ్లస్థలాల కోసం పడిగాపులు
పేదలను అర్హులుగా గుర్తించని వైనం

నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం పడిగాపులు కాస్తున్నారు. పేదలందరికీ ఇళ్లు అందిస్తామని ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలకు చేతలకు పొంతనే లేకుండా ఉంది. అందరికీ ఇళ్లు అంటున్న టిడిపి ప్రభుత్వం తనవారునుకున్న కొందరికి మాత్రమే ఇళ్లను అందించి గొప్పలు చెప్పుకుంటుంది. ప్రభుత్వ తీరుతో పేదలు ఇంకా పరాయి పంచనే ఉంటున్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు ఏళ్లు గడుస్తున్నా కనీసం స్థలాలను కూడా చూపించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ ప్రత్తిపాడులో 500 మంది, ఏలేశ్వరంలో సుమారు 2వేల మంది, రౌతులపూడిలో 332 మంది, శంఖవరంలో 1,152 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వీరిలో ఇళ్లు వచ్చిన వారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. జన్మభూమి కమిటి సభ్యుల ప్రతాపం నిరుపేదలమీద చూపించకుండా పథకాలన్నింటినిలోనూ పారదర్శకత చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీస్థలాలు ఉంటే కేటాయిస్తాం

మండలంలో సుమారు 500 మంది వరకూ ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఖాళీ స్థలాలను గుర్తించాం. ఇళ్ల స్థలాల కోసం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఇళ్లస్థలాలు అందించడానికి కృషి చేస్తాం.

- నాగమల్లేశ్వరరావు, తహశీల్దారు, ప్రత్తిపాడు



రుణం మంజూరు చేయట్లేదు

ఐదేళ్లుగా ఇంటి రుణం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి హామీలు ఇవ్వడం తప్ప సమస్యలను పట్టించుకోవట్లేదు. దీంతో గుడిసెల్లోనే జీవిస్తున్నాం.

- తరుము నాగమ్మ, గిరిజన మహిళ, ఇ.గోకవరం



పింఛను ఇవ్వట్లేదు

నా భర్త చనిపోయి ఐదేళ్లయ్యింది. ప్రతి జన్మభూమిలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. నేటికీ మంజూరు చేయలేదు. జన్మభూమి కమిటీ నాయకుల బంధువులు, కార్యకర్తలకు మాత్రం పింఛన్లు వస్తున్నాయి. అన్ని అర్హతలున్నా నాకు మాత్రం పింఛను ఇవ్వట్లేదు.

- తొండు చిన్నబుల్లి, ఇ.గోకవరం



పింఛన్ల మంజూరులో జాప్యంలేదు

మండలంలో పింఛన్లు మంజూరు విషయంలో ఎటువంటి జాప్యం లేదు. మంజూరైన ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తున్నాం. చాలా మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. లిస్టును ఉన్నతాధికారులకు పంపించాం. మంజూరు కాగానే వారికీ పింఛను అందిస్తాం.

- ఎస్.వి.చలం, మండల అభివృద్ధి అధికారి, ప్రత్తిపాడు